






విద్యా వ్యవస్థను పటిష్ఠం చేస్తాం

ఖమ్మంలో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న తుమ్మల, భట్టి

- ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకు కొరత రానివ్వం
- ఇంగ్లీష్ మీడియం కోసం తెలంగాణ ఇంటర్నేషనల్ పబ్లిక్‌స్కూల్స్
- అన్నిశాఖల్లో బయోమెట్రిక్ పద్ధతి అమలు
- ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్
- త్వరలో 10వేల పోస్టులతో మెగా డీఎస్సీ
- ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి తుమ్మల
- అన్ని పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం: కలెక్టర్
- 'బడిబాట'లో విద్యార్థులకు పుస్తకాలు, దుస్తుల పంపిణీ

ఖమ్మం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో మార్పుకోసమే ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని అధికారంలోకి తెచ్చారని, అందుకు అనుగుణంగా విద్యావ్యవస్థతో పాటు అన్ని వ్యవస్థలను మార్పుచేసి తెలంగాణను విద్యారంగంలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. బడిబాటలో భాగంగా బుధవారం ఎన్నెస్పీ క్యాంప్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు భట్టి, తుమ్మల పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ మెరుగైన ఆంగ్ల విద్యాబోధన కోసం తెలంగాణ ఇంటర్నేషనల్ పబ్లిక్‌స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. తెలంగాణ విద్యాశాఖతో పాటు దశలవారీగా అన్నిశాఖల్లో బయోమెట్రిక్ పద్ధతిని ప్రవేశపెట్టబోతున్నామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో పాఠశాలలు ప్రారంభ రోజునే పిల్లలకు దుస్తులు, పస్తకాలు పంపిణీ చేసిన ఘతన ఈ ప్రభుత్వానిదని తెలిపారు. ప్రతి విద్యార్థికి కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించి ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా విద్యావ్యవస్థను బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోకూడా అంగ్లమీడియం ప్రవేశపెట్టి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. విద్యావ్యాప్తిలో భాగంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్నామని, యూపీఏ ప్రభుత్వం తెచ్చిన ఈవిద్యార్థి చట్టాన్ని తెలంగాణలో పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నామని ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, సాంకేతికతను ఇంగ్లీష్ భాషా నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. తెలంగాణలో విద్యావ్యవస్థను మరింత తీర్చిదిద్దేందుకు తెలంగాణ పేరుతో ఇంటర్నేషనల్ పాఠశాలలో ఏర్పాటు చేస్తున్నామని, స్థలాలు ఏర్పాటుచేసుకుని ముందుకు వస్తే ఈ పాఠశాలలు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కూడా కల్పిస్తున్నామని, దుస్తులు కూడా వారి ఆధ్వర్యంలోనే కుట్టిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మండల విద్యాశాఖ అధికారులు లేనిచోట అర్హులైన వారికి మండల విద్యా పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలన్నారు.

10వేల పోస్టులతో మెగా డీఎస్సీ: తుమ్మల

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రసంగిస్తూ త్వరలోనే 10వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీని ప్రభుత్వం ప్రకటించబోతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే దీనిపై నిర్ణయం తీసుకున్నారని తుమ్మల పేర్కొన్నారు. గతంలో విద్యాసంవత్సరం ప్రారంభమైన మూడు నాలుగు నెలలకు దుస్తులు పుస్తకాలు రావని ఇప్పుడు ప్రారంభంరోజేను పుస్తకాలు, దుస్తులు ఇస్తున్న ఘతన ఈప్రభుత్వానిదన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేయడం విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. విద్యాభివృద్ధికి ఎంత ఖర్చయినా ఈ ప్రభుత్వం వెనుకాడబోదని మంత్రి తుమ్మల అన్నారు.

జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ పాఠశాలల ప్రారంభం రోజునే పిల్లలకు దుస్తులు, పుస్తకాలు అందిస్తున్నామని, స్వయం సహాయక సంఘాల ద్వారా యూనిఫాంలు కుట్టించి ఇస్తున్నామని తెలిపారు. మండలాల్లో కటింగ్, కాజాలు, బటన్ మిషన్ల వినియోగం పట్ల మహిళలకు శిక్షణ ఏర్పాటు చేశామని, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం బోధన చేస్తున్నమని కలెక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మేయర్ నీరజ, కమిషనర్ ఆదర్శసురభి, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, డీఈవో సోమశేఖరశర్మ, కార్పొరేటర్ కమర్తపు మురళి తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు హాజరు అంతంతే..

- పండుగ వాతావరణంలో ప్రారంభమైన పాఠశాలలు

కొత్తగూడెం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): నూతన విద్యాసంవత్సరం బుధవారం ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా బుధవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ప్రాంభంకావటంతో విద్యార్థులు బడిబాట పట్టారు. తొలిరోజు పాఠశాలల్లో విద్యార్థుల హాజరు నామమాత్రంగానే నమోదైంది. ఉదయం 9 గంటలకే విద్యార్థులు ఉపాధ్యాయులు పాఠశాలలకు చేరుకొని పాఠశాల ఆవరణలో మామిడి తోరణాలు కట్టి సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం ప్రార్థన నిర్వహించి తరగతి గదుల్లోకి వెళ్లారు. జిల్లాలో మొత్తం 1,282 ప్రభుత్వ పాఠశాలల్లో 61,310మంది విద్యార్థులు ఉండగా తొలిరోజు కేవలం 33,396 మందే హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. పాఠశాలలకు వచ్చిన విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించే పాఠ్యపుస్తకాలను, యూనిఫామ్స్‌ను అందించారు. పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల పాల్వంచ మండలంలో పర్యటించారు. అయితే జిల్లాలోని అనేక పాఠశాలల్లో తొలిరోజు కొంతమంది విద్యార్థులకే యూనిఫాం, పుస్తకాలు అందాయి. కొన్ని పాఠశాలల్లో మూత్రశాలలు, తాగు నీరు అందుబాటులో లేదనే విమర్శలు వినిపించాయి. కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం మండలం గొల్లగూడెం జీపీఎస్ పాఠశాలలో 'బడిబాట' గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీచైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, డీఆర్‌డీవో విద్యాచందన, ఆర్డీవో మధు, డీఈవో వెంకటేశ్వరచారి పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న తుమ్మల

వివరాలు : 8లో

రహదారుల పనుల్లో నాణ్యత ముఖ్యం

- అవసరమైన ప్రాంతాల్లో ఎగ్జిట్ ఎంట్రీలు ఏర్పాటు చేయాలి
- నేషనల్ హైవే అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం



అధికారులతో మంత్రి పొంగులేటి

వివరాలు : 8లో

పకడ్బందీగా మున్నేరు కరకట్ట పనులు

- నిర్మాణ పనుల విషయంలో నిర్లక్ష్యం సహించను
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- క్షేత్ర స్థాయిలో పరిశీలన



ఆర్టీసీ బస్సులో భట్టి

వివరాలు : 8లో

ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉంది...?

- బస్సులో మహిళలతో డిప్యూటీ సీఎం భట్టి మాటామంతీ
- ఖమ్మం నుంచి జగన్నాథపురం వరకు ప్రయాణం

బాబు ప్రమాణోత్సవానికి ఖమ్మం నేతలు

ఖమ్మం మామిళ్లగూడెం, జూన్ 12: ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశంపార్టీ విజయ ప్రభంజనం సృష్టించి నాలుగోసారి సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి జిల్లా నేతలు తరలివెళ్లారు. ఖమ్మం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి బస్సు, కార్లలో అభిమానులు తరలివెళ్లారు. ఎన్టీఆర్ భవనం టీడీపీ కార్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, జై తెలుగుదేశం, జై ఎన్టీఆర్, జై చంద్రబాబు, అని నినాదాలతో బాణసంచా కాల్చి స్వీట్లు పంచుతూ కదిలివెళ్లారు. వాహనాలను కేతినేని హరీష్ జెండా ఊపి ప్రారంభించారు.

పరస్పరం సహకరించుకోవాలి: తుమ్మల

ఖమ్మం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఏపీలో కొత్తగా ఏర్పడిన టీడీపీ ఆధ్వర్యంలోన ఎన్డీఏ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుని అభివృద్ధిలో పయనించాలని తుమ్మల ఆకాంక్షించారు.

రేపు జిల్లా పరిషత్ సమావేశం

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 12: జిల్లా ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని రేపు (శుక్రవారం) ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో వినోత్ తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. దీనికి జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు హాజరుకానున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు తమ తమ నివేదికలతో ఈ సమావేశానికి సకాలంలో హాజరుకావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.



బ్యాంకు అధికారులకు నగదు అందజేస్తున్న దేవస్థానం ఈవో

భద్రాద్రి హుండీ ఆదాయం రూ.1.68 కోట్లు

భద్రాచలం, జూన్ 12: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి హుండీ ద్వారా రూ.1,68,54,129 ఆదాయం లభించింది. రామాలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో బుధవారం హుండీలను తెరిచి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.1.68,54,129 నగదు, 117 గ్రాముల బంగారం, ఒక కిలో 300 గ్రాముల వెండి లభించింది. యుఎస్ డాలర్లు 57, ఖతర్ రియాల్స్ ఐదు, ఇంగ్లాండ్ పౌండ్స్ 20, ఫిలిఫైన్స్ పిసో 20, నేపాల్ రుపీస్ 950, యేఏఈ దిరాన్స్ 20, మలేషియా రింగ్స్ 14, ఆస్ట్రేలియా డాలర్లు 60, కెనడా డాలర్లు 20 లభించాయి. చివరిసారి హుండీని మే 2న లెక్కించారు. కార్యక్రమంలో ఏఈవో భవానీరామకృష్ణారావు పాల్గొన్నారు.

ఉత్తిపోతలే..!



ఎర్రుపాలెం మండలంలో నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల

- ఇరు జిల్లాల్లో మూలనపడ్డ లిఫ్ట్‌ఇరిగేషన్ పథకాలు
- 135 పథకాల్లో నడుస్తున్నవి 20మాత్రమే
- నిర్వహణ చేయలేకపోతున్న రైతులు
- మరమ్మతులకు రూ.10కోటల నిధుల అంచనా
- ఇకపై ప్రభుత్వమే నిర్వహిస్తుందని సాగునీటి మంత్రి ప్రకటన
- నేటి సమీక్షలో చర్చించాలంటున్న రైతులు

ఖమ్మం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వాగులు, చెరువులు, కాలవలు, ఏరుల నుంచి నీటిని మళ్లించి సాగుకు అందించేందుకు ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాలు నిర్వహణ లోపాలతో నిరుపయోగంగా మారాయి. నాలుగు దశాబ్ధాలుగా ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వాలు వందల సంఖ్యలో ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసినా వాటి నిర్వహణ, మరమ్మతుల విషయంలో నిర్లక్ష్యం ఫలితంగా అనేక ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారాయి. ఉమ్మడి రాష్ట్ర హయాం నుంచే జిల్లాలో అనేక ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. రాష్ట్ర విభజన అనంతరం కూడా ఇరు జిల్లాల్లో పలుచోట్ల ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేశారు. రూ.10లక్షల నుంచి రూ.19కోట్ల వరకు పెట్టి నిర్మించిన ఎత్తిపోతల పథకాలు మొదట్లో కొంత పనిచేసినా తర్వాత మరమ్మతులకు గురై నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం ఈ ఎత్తిపోతల పథకాలు రైతుల నిర్వహణలో ఉండగా అనేక చోట్ల రైతులకు అవగాహన లోపంతో అనేక పథకాలు మూలనపడ్డాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు లక్ష ఎకరాల వరకు ఎత్తిపోతల ద్వారా సాగు చేయాలని లక్ష్యం పెట్టుకుని వీటిని నిర్మించారు గతంలో ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా గోదావరి, కిన్నెరసాని, మున్నేరు, తదితర చోట్ల ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. అలాగే ఎన్నెస్పీ ఆధ్వర్యంలో సాగర్ కాలవలపైనా ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కూడా ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. భద్రాచలం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ఐటీడీఏ నుంచి ఐసాడ్ పథకం సుమారు రూ.20కోట్లతో 20 ఏళ్ల క్రితం ఎత్తిపోతల పథకాల ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఇతర జిల్లాలకంటే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ఎత్తిపోతల పథకాలు ఎక్కువగా ఏర్పాటు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు నుంచి శీలం సిద్ధారెడ్డి, ఆ తర్వాత తుమ్మల నాగేశ్వరరావు హయాంలో ఎక్కువశాతం ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంత్రులుగా పనిచేసిన జలగం ప్రసాదరావు సంబాని చంద్రశేఖర్, డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న భట్టి విక్రమార్క హయాంలోనూ లిఫ్టులు ఏర్పాటు చేశారు. అయితే అనేక కారణాలతో ఈ ఎత్తిపోతల పథకాల నిర్వహణ మూలన పడడంతో ఆయా లిఫ్టులు మరమ్మతులకు గురై శిథిలావస్థకు చేరుతున్నాయి.

ప్రస్తుతం ఇరు జిల్లాల్లో 135వరకు ఎత్తిపోతల పథకాలుండగా వాటిలో 20 మాత్రమే పనిచేస్తున్నాయి. పనిచేయని లిఫ్టలకు మరమ్మతులు చేయించాలంటే సుమారు రూ.10కోట్లు నిధులు అవసరం అవసరం అవుతాయి. ఖమ్మం జిల్లా పరిధిలోని ఎత్తిపోతల పథకాలకే రూ.5.60కోట్లు అవసరం ఉంది. కొన్నిచోట్ల మోటార్లు కాలిపోగా కొన్నిచోట్ల మోటార్లు శిథిలావస్థలో ఉన్నాయి. తాజాగా నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వమే నిర్వహిస్తుందని, రైతుల నుంచి నిర్వహణ బాధ్యతలు తొలిగించి శాఖాపరంగా నిర్వహిస్తామని ప్రకటించారు. అదే జరిగితే జిల్లాలో ఉన్న లిఫ్ట ఇరిగేషన్ల దశ మారే అవకాశం ఉంది. అలాగే ఐడీసీ, ఎన్ఎస్‌పీ, ఐటీడీఏ, ఎస్సీ కార్పొరేషన్ తదితర శాఖల ద్వారా నిర్మితమైన అన్ని ఎత్తిపోతల పథకాలను ప్రత్యేకంగా అధికారుల బృందం ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వాటి వాస్తవ పరిస్థితి అర్థమవుతుంది. ఈ నేపథ్యంలో బుధవారం జరిగే సమీక్షలో మంత్రులు ఈ ఎత్తిపోతల పథకాల దుస్థితిపై కూడా దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

నేడు 'సీతారామ' వద్దకు నలుగురు మంత్రులు



ఖమ్మం, జూన్ 12 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో రూ.15వేల కోట్లతో నిర్మాణంలో ఉన్న సీతారామ సాగునీటి ఎత్తిపోతల పనులను గురువారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించనున్నారు. సీతారామప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తిచేసి గోదావరి జలాలను వైరా ప్రాజెక్టుకు తరలించి ఎన్నెస్పీకి అనుసంధానం చేసేందుకు తలపెట్టిన పనులను త్వరితగతిన పూర్తిచేయించేందుకు మంత్రులు పర్యవేక్షించనున్నారు. దశాబ్దకాలంగా సీతారామ ఎత్తిపోతల పథకంలో సమీక్షలు,అనుమతులు రాక పనులు నత్తనడకన సాగుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన ఈ పనులు ఏడేళ్లయినా పూర్తికాలేదు. రూ.15వేల కోట్లతో చేపట్టిన సీతారామ ఎత్తిపోతల రూ.2,700కోట్లతో చేపట్టిన సీతమ్మసాగర్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ప్రభుత్వం మారిన తర్వాత అసెంబ్లీలో ఈ ప్రాజెక్టు పనులపై సుదీర్ఘ చర్చకూడా జరిగింది. అయితే ప్రత్యక్షంగా ప్రస్తుతం జరిగిన పనులు పరిశీలించి ప్రభుత్వం తదుపరి నిధులు మంజూరుచేసి పనులు చేపట్టేందుకు క్షేత్రస్థాయిలో మంత్రివర్గం గురువారం పరిశీలించి వాస్తవ పరిస్థితులు తెలుసుకోనుంది. గురువారం ఉదయం 10-00గంటలకు సీతారామ ప్రాజెక్టు పనులను అశ్వాపురం మండలంలోని గోదావరి వద్ద సీతమ్మసాగర్‌తో పాటు సీతారామ ఎత్తిపోతల పనులు పరిశీలిస్తారు. లిఫ్టు ఇరిగేషన్ రెగ్యులరేటరీ పనులను అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు వద్ద పంపు హౌస్ కెనాల్ పనులను, ములకలపల్లి మండలంలోని పంపు హౌస్ 2, పూసూగూడెంలోని పంపు హౌస్ 3 పనులను పరిశీలిస్తారు. కమలాపురం, వయా పాల్వంచ, కొత్తగూడెం జూలూరుపాడు మీదుగా ఉన్న ఏన్కూరు లింక్ కెనాల్ పనులను మంత్రులు పరిశీలించనున్నారు.



వీసా పేరుతో మోసం

- కెనడాలో వర్క్ వీసాలు ఇపిస్తానని రూ.లక్షలు వసూలు
- వర్కింగ్ వీసాకు బదులు విజిటింగ్ వీసాను అంటగట్టిన వైనం
- అమాయకుడిని నిండా ముంచిన దళారీ
- అబుదాబి, కెనాడా నుంచి వెనక్కి పంపించిన ఇమ్మిగ్రేషన్ అధికారులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు
- వైరాలో వెలుగు చూసిన ఘటన
- పదుల సంఖ్యలో బాధితులు

వివరాలు : 8లో



ప్రభుత్వ ఆస్పత్రిలో రిపేరుకు వచ్చి..

- విద్యుదాఘాతంతో ప్రైవేటు ఎలక్ట్రీషియన్ మృతి
- మృతదేహంతో బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన
- కొణిజర్లలో విషాదం

9

వైద్య శాఖలో 73 పోస్టుల తాత్కాలిక జాబితా విడుదల

»అభ్యంతరాలు తెలపండి » అభ్యర్థులకు డీఎంహెచ్‌వో శిరీష వినతి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్12: 73 పోస్టులకు గాను అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ప్రాతిపాధికన భర్తీ చేసేందుకు గతంలో నోటిఫికేషన్ విడుదల అయిన సంగతి తెలిసిందే. ఈ నోటిఫికేషన్‌లో 13 కేటగిరిలలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల తాత్కాలిక జాబితా ఐడివోసిలో డిఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం నోటీసు బోర్డు వద్ద ఏర్పాటు చేశారు. ఆదేవిధంగా అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఈ జాబితాలో తమ పేర్లను చూసుకునేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు డిఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం వద్ద నోటీసు బోర్డు ముందు చూసుకునేందుకు ఆసక్తి చూపారు. కొంత మంది అభ్యర్థులు 2 నుంచి 4 పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో కొంతమందికి ఒక్క పోస్టుకే దరఖాస్తు చేసుకున్నట్లు జాబితాలో ఉండడంతో అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందు ఈ నోటిఫికేషన్ విడుదల అవగా భారీ ఎత్తున నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు బారులు తీశారు. అనంతరం ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో సుదీర్ఘ కాలం అనంతరం ఎన్నికల కోడ్ ముగీయగా తాత్కాలిక జాబితాను జిల్లా కలెక్టర్ ఆదేశాలనుసారం విడుదల చేశారు. ఈ తాత్కాలిక జాబితాపై ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా శుక్రవారం సాయంత్రం పని వేళల లోపు లిఖిత పూర్వకంగా అందజేయాలని డిఎంహెచ్‌వో డాక్టర్ శిరీష తెలిపారు.

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఆలస్యం?

నీట్-2024పై రగడే కారణం!.. తెలంగాణలో 56 కాలేజీల్లో 8,515 ఎంబీబీఎస్ సీట్లు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యకు సంబంధించి ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ఈ ఏడాది ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. నీట్-2024పై దేశ వ్యాప్తంగా జరుగుతున్న రగడే ఇందుకు కారణం. నీట్ మార్కులపై ఇప్పటికే సుప్రీం కోర్టులో కేసు నడుస్తోంది. నీట్-2024ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్న పిల్‌ను కోర్టు తోసిపుచ్చింది. కానీ, నీట్ విషయంలో మరిన్ని కేసులు పడే అవకాశం ఉందని, విషయం అంత త్వరగా తేలేట్లుగా కనిపించడం లేదని జాతీయ వైద్య విద్య కమిషన్(ఎన్ఎంసీ) అధికారులు రాష్ట్ర వైద్య విద్య ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. మరోపక్క, దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలు, వాటిలోని సీట్ల వివరాలను ఎన్ఎంసీ తన వెబ్‌సైట్‌లో పెట్టింది. విద్యార్థులు ఆయా కళాశాలల్లోనే చేరాలనే పేర్కొంది. ఎన్ఎంసీ వెబ్‌సైట్ ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు కలిపి తెలంగాణలో 56 వైద్య కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో మొత్తం 8,515 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి.

కొత్త కాలేజీల సంగతేంటో?

రాష్ట్రం ప్రభుత్వం దరఖాస్తు చేసిన కొత్త వైద్య కళాశాలల అనుమతిపై ఎన్ఎంసీ ఏటూ తేల్చడం లేదు. అనుమతి ఇస్తారో? ఇవ్వరో కూడా స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో కొత్త కళాశాలల్లో ఈ ఏడాది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం అనుమానంగానే ఉంది. గద్వాల, వరంగల్(నర్సంపేట), యాదాద్రి, మేడ్చల్ (కుత్బుల్లాపూర్), నారాయణపేట్, ములుగు, మెదక్, రంగారెడ్డి(మహేశ్వరం) జిల్లాల్లో వైద్య కళాశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆగస్టు- సెప్టెంబరులో ఎన్ఎంసీకి దరఖాస్తు చేసింది. ఆయా కళాశాలలను వర్చువల్‌గా, స్వయంగా తనిఖీ చేసిన ఎన్ఎంసీ బృందాలు పలు లోపాలను ఎత్తి చూపి వాటిని సరిచేసుకోవాలని సూచించాయి. ఆ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ లోపాలను సవరించింది. అయితే వైద్య కళాశాలలకు లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్ఓపీ) ఇచ్చేముందు ఎన్ఎంసీ బృందాలు మరోమారు తనిఖీ చేస్తాయి. మరికొద్ది రోజుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఎన్ఎంసీ బృందాలు ఇప్పటిదాకా మళ్లీ తనిఖీలకు రాలేదు. నిజానికి, తాము ఎత్తిచూపిన లోపాలను సరి చేసుకున్నట్టు చూపించిన తర్వాత వాటికి సంతృప్తి చెందితేనే ఎన్ఎంసీ అనుమతి ఇస్తుంది. ఒకవేళ అనుమతి ఇవ్వకపోతే ప్రభుత్వం అప్పీలు చేసుకునే వీలుంటుంది. ప్రభుత్వ కళాశాల కాబట్టి సర్కారే గ్యారంటీగా ఉండి లోపాలను సవరించుకుంటామని లిఖితపూర్వక హామీనిస్తుంది. దాంతో ఎన్ఎంసీ అనుమతి మంజూరు చేస్తుంది. ఈ వ్యవహారానికి 20-30 రోజుల సమయం పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. దీంతో త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరుతూ వైద్యవిద్య సంచాలకులు ఎన్ఎంసీకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎన్ఎంసీ ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది. మరోపక్క, అనుమతుల విషయమై కొన్ని వైద్య కళాశాలల యాజమాన్యాలు ఇప్పటికే కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రిని కలిసి చర్చినట్టు సమాచారం.

సింగరేణిలో జలవిద్యుత్ ఉత్పత్తికి చర్యలు

● ఈఅండ్‌ఎం డైరెక్టర్ సత్యనారాయణరావు

రుద్రంపూర్, (సింగరేణి) జూన్ 12: సింగరేణిలో జల విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు ఈఅండ్‌ఎం డైరెక్టర్ సత్యనారాయణరావు తెలిపారు. బుధవారం సింగరేణి ప్రదాన కార్యాలయంలో సోలార్ విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇల్లెందు ఏరియాలోని జవహర్‌గని ఉపరితలగనిలో ఏర్పాటు చేసే పంపుస్టోరేజీ హైడల్ ప్రాజెక్టుపై సంబంధిత అధికారులతో చర్చలు జరిపారు. సింగరేణిలో మూతపడిన ఉపరితల గనుల్లో సద్వినియోగం చేసుకునే దిశగా ప్రయత్నిస్తున్నట్లు ప్రకటించారు. సౌరవిద్యుత్ సాయంతో రాత్రి సమయంలో జల విద్యుత్ ఉత్పత్తి చేస్తామన్నారు. జల విద్యుత్‌కు అవసరమైన వ్యయంపై టాటా కన్సెల్టెంటీ బృందంతో చరించారు. ఈ కార్యక్రమంలో జీఎం సీపీపీ రవికుమార్, ఈఅండ్‌ఎం జీఎం జానకీరాం, సర్వే జీఎం జైనుల్లాబుద్దీన్‌తోపాటు ఇల్లెందు జీఎం జాన్‌ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులను బ్యాంకర్లు ఇబ్బంది పెట్టొద్దు

» భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్

భద్రాచలం, జూన్ 12: ట్రైకార్ పథకంకు అర్హులైన లబ్దిదారులను బ్యాంకు అధికారులు ఇబ్బంది పెట్టవద్దని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ అన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో ట్రైకార్ పథకంపై పీవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైకార్, ఎంఎస్‌ఎంఈ యూనిట్, రైతులకు క్రాప్‌లోన్లపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీవో మాట్లాడుతూ ట్రైకార్‌కు సంబంధించి యూనిట్లు లాగిన్ అయి పెండింగ్‌లో ఉన్నవి త్వరితగతిన క్లియర్ చేయాలని, 75 యూనిట్లను త్వరా గ్రౌండ్ చేయాలని కోరారు. మారుమూల ప్రాంతాల్లో రైతుల వద్ద ధరణి పట్టా, ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా, అసైన్డ్ భూములకు సంబంధించిన పట్టా ఏది ఉన్న రైతులకు ఇబ్బంది పెట్టకుండా క్రాప్‌లోను మంజూరు చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, ఏడీ అగ్రికల్చర్ భాస్కరన్, హెచ్ఎన్‌టీ సీ అశోక్, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.



ట్రైకార్‌పై సమీక్ష నిర్వహిస్తున్న పీవో

బాలికల ఆశ్రమ పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్యే, పీవో

భద్రాచలంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, పీవో ప్రతీక్‌జైన్‌లు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాలికల మానసిక స్థితిగతులను ఎప్పటికప్పుడు పరిశీలించి వారిలో మనోధైర్యాన్ని నింపాలన్నారు. అనంతరం తరగతి గదు లు, వసతి నిలయం, ట్యాంకులు, ట్యాపులు, డార్మెట్రీ, డైనింగ్ హాలును పరిశీలించారు.

గ్రూప్-1 మెయిన్స్ 7 రోజులు

(మొదటిపేజీ తరువాయి)

మీడియంలోనే రాయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న సమయంలోనే ఏ మీడియంలో రాసేదీ తెలపాల్సి ఉంటుంది. ఒక పరీక్ష తెలుగులో, మరో పేపర్‌ను ఇంగ్లిష్‌లో రాయడానికి వీల్లేదు. అలా వేర్వేరు మాధ్యమాల్లో రాసినవారి పేపర్లను పరిగణనలోకి తీసుకోరు. రాష్ట్రంలో సుమారు 563 గ్రూపు-1 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను త్వరలోనే ప్రకటించనున్నారు. అందులో ఉత్తీర్ణులైనవారిని.. ఒక్కో పోస్టుకు 50 మంది అభ్యర్థుల చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేయనున్నారు. మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచే అభ్యర్థులను పోస్టులకు ఎంపిక చేస్తారు. ఈ నియామకాల్లో ఏలాంటి ఇంటర్వ్యూలూ ఉండవు. మెయిన్ పరీక్షలకు సంబంధించిన వివరాలను కమిషన్ అధికారులు బుధవారం వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం..

ఇదీ షెడ్యూలు	
తేదీ	పేపర్
అక్టోబరు 21	జనరల్ ఇంగ్లిష్
అక్టోబరు 22	జనరల్ ఎస్సే (పేపర్-1)
అక్టోబరు 23	చరిత్ర, కల్చర్ అండ్ జాగ్రఫీ (పేపర్-2)
అక్టోబరు 24	ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం-గవర్నెన్స్ (పేపర్-3)
అక్టోబరు 25	ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ (పేపర్-4)
అక్టోబరు 26	సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ (పేపర్-5)
అక్టోబరు 27	తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ (పేపర్-6)

- పరీక్షల తొలిరోజు అయిన అక్టోబరు 21న క్వాలిఫైయింగ్ టెస్ట్ (జనరల్ ఇంగ్లిష్ పరీక్ష) నిర్వహించనున్నారు. అనంతరం ఇతర పేపర్ల పరీక్షలను నిర్వహిస్తారు. క్వాలిఫైయింగ్ టెస్ట్ కాకుండా మెయిన్స్‌లో మొత్తం 6 పేపర్లకు పరీక్షలను నిర్వహిస్తున్నారు.
- పరీక్షలన్నీ హైదరాబాద్, దాని చుట్టు పక్కల హెచ్ఎండీఏ పరిధిలోనే జరుగుతాయి.
- ప్రతిపేపర్‌లోనూ 150 మార్కులకు ప్రశ్నలుంటాయి.
- అభ్యర్థులు అన్ని పేపర్లూ రాయాల్సి ఉంటుంది. ఏ ఒక్క పరీక్షకు గైర్హాజరైనా ఆ అభ్యర్థులు రాసిన ఇతర పేపర్లను పరిగణనలోకి తీసుకోరు.
- క్వాలిఫయింగ్ పరీక్షను 10వ తరగతి ప్రమాణాలతో నిర్వహిస్తారు. ఇతర పేపర్ల పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను ఇప్పటికే ప్రకటించారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ కీ విడుదల

ఈ నెల 9వ తేదీన నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కీని విడుదల చేశారు. గురువారం (13వ తేదీ) నుంచి 17వ తేదీ మధ్య ఈ కీ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. కీపై అభ్యంతరాలుంటే.. 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తెలపాల్సిందిగా అభ్యర్థులకు అధికారులు సూచించారు.

నేడు లాసెట్ ఫలితాల విడుదల

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లాసెట్ ఫలితాలను ఈ నెల 13వ తేదీన విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. గురువారం సాయంత్రం 3.30 గంటలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఈ ఫలితాలను ప్రకటించనున్నారు.

నేటి నుంచి రెండోదశ దోస్త్

డిగ్రీలో ప్రవేశాలకు సంబంధించి 13వ తేదీ నుంచి రెండో దశ దోస్త్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు కానుంది. మొదటి దశలో సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 15వ తేదీలో ముగియనుంది. 14,15వ తేదీల్లో అభ్యర్థులు తమ వెబ్‌ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ఔటర్.. బంగారు బాతే!

వాహనాల రద్దీతో నెల నెలా పెరుగుతున్న ఆదాయం

» ఏప్రిల్‌లో రూ.60 కోట్లు..

» మే నెలలో 62.7 కోట్ల రాబడి



హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు.. ఆదాయ పరంగా బంగారు బాతు అన్నది స్పష్టమవుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీతో ఆదాయం భారీగా పెరుగుతోంది. ప్రతి నెలా హెచ్ఎండీఏ అధికారులు ఊహించని స్థాయిలో రాబడి వస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డును లీజుకు ఇచ్చే సందర్భంలో ఓ ప్రైవేటు ఏజెన్సీ మదింపు చేసిన ఆదాయ అంచనాలన్నీ తలకిందులవుతున్నాయి. అప్పుడు.. ఏడాదికి 2శాతం నుంచి 3శాతం వరకు ఆదాయం పెరుగుతుందని అంచనాలు వేయగా, ప్రస్తుతం ఒక్కో నెలకే 4శాతానికి పైగా పెరుగుతోంది. టోల్ చార్జీలు పెంచక ముందే ఆదాయం ఈ స్థాయిలో పెరుగుతుండడంతో.. చార్జీల పెంపుతో మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఔటర్ ఆదాయంపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలు అక్షరసత్యాలు అని నిరూపితమవుతున్నాయి. గతేడాది ఔటర్ రింగ్ రోడ్డును హెచ్ఎండీఏ గత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిన విషయం తెలిసిందే. దీంతో ఏటేటా భారీ ఆదాయాన్ని సమకూర్చే ఔటర్‌ను చాలా తక్కువ బిడ్‌కు 30 ఏళ్లకు లీజుకివ్వడాన్ని ప్రస్తావిస్తూ.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతోపాటు ఔటర్‌పై ఏటా పెరిగే ఆదాయ, వ్యయాలను అంచనా వేసి చూపిస్తూ.. రాష్ట్రానికి బంగారు బాతు లాంటి ఔటర్‌ను ప్రైవేటుపరం చేయడాన్ని పేర్కొంటూ 'బంగారు బాతు.. బలి' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. ఈ కథనాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడంతోపాటు అప్పటి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాయి. విపక్షాలకు అస్త్రంగా మారాయి. ఆ కథనాలన్నీ ఇప్పుడు అక్షరసత్యాలుగా నిరూపితమవుతున్నాయి.

టోల్ చార్జీల పెంపుతో సంబంధం లేకుండానే

ఔటర్‌ను ప్రైవేటు సంస్థకు అప్పగించిన సందర్భంలో ఆదాయాన్ని మదింపు చేసిన ఏజెన్సీ.. ఏటా 2శాతం నుంచి 3శాతానికి అటు, ఇటుగా రాబడి పెరుగుతుందని అంచనాలు వేసింది. ముఖ్యంగా హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ (డబ్ల్యూపీఐ) ప్రకారం ఏటా టోల్ చార్జీల్లో చోటుచేసుకునే 4శాతం నుంచి 5శాతం పెంపుదల మేరకే ఆదాయం పెరుగుతుందని ఆ ఏజెన్సీ తేల్చింది. సాధారణంగా ఏప్రిల్ నుంచి కొత్తగా అందుబాటులోకి వచ్చే టోల్ చార్జీలతో ఆ ఆర్థిక సంవత్సరానికి ఆదాయం పెరుగుతుందని హెచ్ఎండీఏ అధికారులు కూడా అంచనాలు వేశారు. కానీ, ప్రస్తుతం టోల్ చార్జీలు పెంచకుండానే ప్రతి నెలా ఆదాయం పెరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.60.2 కోట్ల ఆదాయం రాగా, మే నెలలో రూ.62.7 కోట్లు వచ్చింది. అంటే దాదాపు రూ.2.5 కోట్లు పెరిగింది. ఒక్క నెలకే 4.2 శాతం పెరుగుదల నమోదైంది. ఈ పెరుగుదల గతేడాది నుంచి కొనసాగుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ వాహనాల రద్దీ పెరుగుతుండడంతో ఆ మేరకు ఆదాయం పెరుగుతోంది. కాగా, డబ్ల్యూపీఐ ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ చార్జీలు ఏప్రిల్ 1 నుంచే పెరగాలి. కానీ, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని పెంచకుండా నిలిపివేశారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడంతో టోల్ చార్జీలు పెంచుకోవడానికి అవకాశం కల్పించారు. దాంతో ఈ చార్జీలు 4శాతం నుంచి 5శాతం మేర పెరిగాయి. ఇందుకు అనుగుణంగా ఆదాయం పెరుగుతుందని, వాహనాల రద్దీ ద్వారా వచ్చే ఆదాయం అదనంగా ఉంటుందని హెచ్ఎండీఏ- హెచ్‌జీసీఎల్‌కు చెందిన ఓ అధికారి తెలిపారు.

ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉంది..?



పాతర్లపాడు గ్రామానికి వెళ్లే బస్సును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

» బస్సులో మహిళలతో డిప్యూటీ సీఎం భట్టి మాటామంతీ

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్ 12: 'కరెంటు మంచిగా వస్తున్నదా..? ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ఎలా ఉంది...? ఎన్నిసార్లు ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు..?' అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క... ప్రయాణికులతో ముచ్చటించారు. బుధవారం సాయంత్రం ఖమ్మం పాత బస్టాండ్ నుంచి బోనకల్లు మండలం జగన్నాథపురం వరకు పల్లెవెలుగు బస్సులో ప్రయాణించారు. సామాన్యుడిలా టికెట్ కొనుక్కొని మరీ ప్రయాణించారు. ఈ సందరభంగా బస్సులో ఆయన నాగులవంచ గ్రామానికి చెందిన జానమ్మ, అనంతమ్మలతో ముచ్చటించారు. 'బడి, గుడి, పేరంటాలకు ఉచితంగా బస్సులో వెళ్లడం మూలంగా డబ్బులు మిగులుతున్నాయి... ఆర్థికంగా కొంత వెసులుబాటు కలుగుతోంది' అని వారు సంతోషంగా సమాధానం ఇచ్చారు. జీరో టికెట్ల విధానం గురించి కండక్టర్ శైలజను డిప్యూటీ సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భట్టి విలేకరులతో మాట్లాడుతూ మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడం వల్ల ఆర్టీసీ బలోపేతం అవుతున్నదని, కొత్తగా 300 పైగా బస్సులు కొనుగోలు చేసినట్టు తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు రుణాలు ఇప్పించి వారితో బస్సులు కొనుగోలు చేయించి వాటిని ఆర్టీసీలో పెట్టాలన్న ఆలోచన చేస్తున్నామని తెలిపారు. అంతకుముందు ఖమ్మం పాత బస్టాండ్‌లో పాతర్లపాడు గ్రామానికి వెళ్లే బస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైరా శాసనసభ్యుడు రాందాస్ నాయక్, కలెక్టర్ గౌతమ్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రహదారుల పనుల్లో నాణ్యత ముఖ్యం

● నేషనల్ హైవే అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

ఖమ్మం, జూన్12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జాతీయ రహదారుల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, పనులు చేపట్టాలని అవసరమైన ప్రాంతాల్లో ఎగ్జిట్, ఎంట్రీలను ఏర్పాటు చేయాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో నేషనల్ హైవే అధికారులతో సమావేశమై పనుల ప్రగతి గురించి తెలుసుకున్నారు. రహదారి పనుల్లో వేగం పెంచాలని, కోరారు. ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయరహదారి, ఖమ్మం-అశ్వారావుపేట పనులు వేగవంతం చేయాలని కోరారు. కల్లూరు నుంచి మధిర రోడ్డు, ధంసలాపురం నుంచి బోనకల్ రోడ్డువద్ద, వేంసూరు-సత్తుపల్లి రోడ్డు వద్ద ఎగ్జిట్ మరియు ఎంట్రీపాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఖమ్మం నగరంలోకి ప్రవేశించేటప్పుడు ధంసలాపురం-బోనకల్ రోడ్డు వద్ద ఎగ్జిట్, ఎంట్రీపాయింట్లు ఇవ్వాలని తద్వారా నగర వాసులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఖమ్మం-అశ్వారావుపేట రోడ్డు మరమ్మతులు పూర్తిచేయాలని, క్షేత్రస్థాయిలో రహదారులు తనిఖీచేయాలని మంత్రి తుమ్మల సూచించారు.

సర్దార్ జలగం వెంగళరావు వర్ధంతి



జలగం విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్, జూన్12: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి సర్దార్ జలగం వెంగళరావు వర్ధంతి సందర్భంగా సత్తుపల్లిలోని జేవీఆర్ కాంస్య విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను అభివృద్ధి నడపడంలో జలగం కృషి అనిర్వచనీయమని, ఆయన చేపట్టిన సంస్కరణలు పలువురికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, చల్లగుళ్ల నరసింహారావు, గాదె చెన్నారావు, నరేందర్ రెడ్డి, ఎండీ.కమల్‌పాషా, మందపాటి రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా మున్నేరు కరకట్ట పనులు

● మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


ఖమ్మం కార్పొరేషన్, జూన్ 12: దశాబ్దాల కాలంగా ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల ప్రజలు ఎదుర్కుంటున్న మున్నేరు ముంపు సమస్య శాశ్వత పరిష్కారం కోసం చేపడుతున్న మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం వద్దని రెవెన్యూ, హౌజింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పనుల్లో పురోగతి లేకున్నా, నాణ్యత లేకున్నా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం మంత్రి దానవాయిగూడెం వద్ద మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల పురోగతిని తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా డిటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్టును (డీపీఆర్) పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మున్నేరు ముప్పుకు శాశ్వతపరిష్కారం కోసమే మున్నేరు తీరం వెంట ఆర్‌సీసీ రిటైనింగ్‌వాల్ నిర్మాణం చేపడుతున్నామన్నారు. దీనివల్ల మున్నేరు నదిఒడ్డున నివాసం ఉంటున్న కాలనీవాసులకు ముంపు సమస్య శాశ్వతంగా తీరుతుందన్నారు. రూ.690.52 కోట్ల అంచనాతో మున్నేరుకు కుడివైపు 8,5 కిలోమీటర్లు, ఎడమవైపు 8.5కిలోమీటర్లు మొత్తం 17కిలోమీటర్ల పొడవుతో రిటైనింగ్‌వాల్ నిర్మాణం చేపడుతున్నారు. వాల్ ఎత్తు గరిష్ఠంగా 11మీటర్లు, కనిష్ఠంగా 6మీటర్లు ఉంటుందన్నారు. మున్నేరుకు ఇరువైపులా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ భూముల సర్వే చేపట్టాలని మంత్రి పొంగులేటి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ భూముల సేకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములను ఇరిగేషన్‌శాఖకు అప్పగించాలన్నారు. గోళ్లపాడు చానెల్ ఇన్‌లెట్ ఎక్కడ చేశారో చూసి, అదే మాదిరిగా డ్రెయిన్‌వాటర్ ఇన్‌లెట్ చేయాలని సూచించారు. ప్రారంభపాయింట్, చివరిపాయింట్‌లను గుర్తించి, సైడ్ డ్రెయిన్‌ల నిర్మాణాలను చేపట్టాలని, తద్వారా మురుగునీరు మున్నేరులో చేరకుండా ఉంటుందన్నారు. పదిరోజుల్లో తిరిగి పనుల పరిశీలనకు వస్తానని, పనుల్లో పురోగతి కనిపించాలని, పనుల్లో నాణ్యత లేకుంటే ఉపేక్షించనని, బాధ్యులపై చర్యలు తీసుకుంటానని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి, ఇరిగేషన్ సీఈ విద్యాసాగర్, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, నగరపాలకసంస్థ, ఇరిగేషన్ ఇంజనీర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కరకట్ట పనులను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

వీసా పేరుతో మోసం



వైరా, జూన్ 12: కెనడాలో ఉద్యోగాల పేరిట నిరుద్యోగులను నమ్మించి లక్షలాది రూపాయలు కాజేసిన ఓ ఘరానా మోసగాడి ఉదంతమిది. బాధితులు పదుల సంఖ్యలోనే ఉన్నా ప్రస్తుతానికి ఒక్క బాధితుడు మాత్రమే ముందుకొచ్చి తనను జరిగిన మోసంపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం బయటపడింది. ఖమ్మం జిల్లా వైరా మండలంలోని ఒక్క గన్నవరం గ్రామంలోనే సుమారు 14మంది బాధితులు ఉన్నట్లు సమాచారం. వీరు దాదాపు రూ.కోటిపైగా మోసపోయినట్లు చర్చ జరుగుతోంది. తల్లాడ, కల్లూరు మండలాల్లోనూ ఈ మోసానికి బలైనవారున్నట్లు సమాచారం. విజిటింగ్ వీసాను వర్కింగ్ వీసాగా నమ్మించి మోసగించడం విస్తుగొలుపుతోంది.

వైరాలోని సుందరయ్యనగర్ ప్రాంతానికి చెందిన నెట్‌సెంటర్ నిర్వాహకుడు పిడతల నాగేశ్వరరావు ఈ మోసానికి తెరదీశాడు. కెడాలో వర్క్ వీసాలు ఇప్పిస్తామని, అక్కడకు వెళ్లి మంచి ఉద్యోగాలు చేసుకొని ఆర్థికంగా ఎదగవచ్చని నమ్మబలకడంతో పదుల సంఖ్యలో నిరుద్యోగులు అడిగినంత మొత్తాన్ని సమర్పించుకున్నారు. అయితే ఎవరికీ వీసాలు రాకపోవడంతో గన్నవరం గ్రామానికి చెందిన బాధితుడు బొగ్గుల వీరవెంకట సత్యనారాయణరెడ్డి తనను మోసం చేసిన పిడతల నాగేశ్వరరావుపై మంగళవారం రాత్రి వైరా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

డిగ్రీ పూర్తిచేసి కూలిపనులు చేసుకుంటూ జీవిస్తున్న తనకు ఏడునెలల క్రితం వైరాకు చెందిన పిడతల నాగేశ్వరరావు అతడి భార్య కిరణకుమారి పరిచయం అయ్యారని సత్యనారాయణరెడ్డి తెలిపాడు. ఇతర దేశాల్లో తనకు స్నేహితులున్నారని, నిరుద్యోగులకు అక్కడ వర్క్‌వీసాలు ఇప్పించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని చెప్పినట్లు నాగేశ్వరరావు తనను నమ్మించాడని పేర్కొన్నారు. ఇతర దేశాల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటే తాను వెళ్తానని నాగేశ్వరరావుకు చెప్పినట్లు పేర్కొన్నాడు. దాంతో నాగేశ్వరరావు తనకు కెనడాలో స్నేహితులు ఉన్నారని, మీ భార్యభర్తలిద్దరూ వర్కింగ్ వీసాల మీద కెనడా వెళ్లి జీవనోపాధి పొందవచ్చునని, ఇద్దరికీ రూ.15లక్షలు ఖర్చవుతుందని చెప్పినట్లు పేర్కొన్నారు.

పాస్‌పోర్ట్ చేయించుకున్న తర్వాత నాగేశ్వరరావును కలవగా వీసా ఖర్చుల నిమిత్తం రూ.2లక్షలు ఇవ్వాలని కోరాడని, ఆ మొత్తాన్ని గత ఏడాది డిసెంబరు 28న ఇచ్చానని తెలిపారు. వీసా వచ్చిన తర్వాత మరో రూ.12లక్షలు ఇవ్వాలని చెప్పాడని తెలిపారు. తాను రూ.2లక్షలు చెల్లించిన 15రోజుల తర్వాత నాగేశ్వరరావు దంపతులు తనకు ఫోన్ చేసి నీ భార్యకు వర్కింగ్ వీసా వచ్చిందని, ఈ ఏడాది ఫిబ్రవరి 27న కెనాడా వెళ్లాల్సి వస్తుందని అందుకు విమాన ఖర్చుల నిమిత్తం ఇద్దరూ రూ.3.70లక్షలు ఇవ్వాలని నమ్మబలికాడని పేర్కొన్నాడు. దాంతో తాను కెనడాలో పరిస్థితులను చూసిన తర్వాత తన భార్యను అక్కడకు తీసుకువెళ్తానని, ప్రస్తుతం తాను ఒక్కడినే కెనడాకు వెళ్తానని చెప్పి అదేరోజు రూ.1.85లక్షలు ఇచ్చానని తెలిపాడు.

అదేరోజు హైదరాబాద్ నుంచి కెనడా వెళ్లేందుకు తాను విమానం ఎక్కి అబుదాబీలో దిగిన తర్వాత అక్కడి ఇమిగ్రేషన్ అధికారులు తన దగ్గర ఉన్న పత్రాలను పరిశీలించి అవి తప్పుడు పత్రాలుగా నిర్ధారించి తనను అక్కడి నుంచే హైదరాబాద్‌కు తిరిగి పంపించారని బాధితుడు తెలిపాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న అబుదాబీ నుంచి హైదరాబాద్‌లోని తన సోదరి ఇంటికి వెళ్లి నాగేశ్వరరావుకు ఫోన్ ద్వారా జరిగిన విషయాన్ని వివరించగా ఏదో తప్పిదం జరిగిందని నాలుగురోజుల్లో తనను కెనడా పంపిస్తానని అప్పటివరకు హైదరాబాద్‌లోనే ఉండాలని సూచించాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అంతేకాకుండా మళ్లీ ఫిబ్రవరి 29న వర్కింగ్ వీసా వచ్చిందని, విమాన ఖర్చుల నిమిత్తం డబ్బు చెల్లించాలని చెప్పగా రూ.2,04,500 బ్యాంకు ద్వారా ఆయనకు బదిలీ చేశానని పేర్కొన్నాడు.

తర్వాత ఈ ఏడాది మార్చి 4న తాను హైదరాబాద్ నుంచి కెనడా వెళ్లగా అక్కడ విమానాశ్రయంలోని ఇమిగ్రేషన్ అధికారులు తన దగ్గర ఉన్న పత్రాలను పరిశీలించి అవి నకిలీ పత్రాలని నిర్ధారించడంతో అక్కడి నుంచే నాగేశ్వరరావుకు ఫోన్ చేయగా కొద్దిరోజులు అక్కడే ఉండమని సూచించినట్లు ఫిర్యాదులో తెలిపాడు. విజిటింగ్ వీసాను వర్కింగ్ వీసాగా చెప్పి తనను నమ్మించాడని, కెనడాలోని కొందరు వ్యక్తుల ఫొటోలు, అడ్రస్‌లు సేకరించి వారు స్పాన్సర్ చేస్తున్నట్లుగా వీసా తీయించాడని బాధితుడు వెల్లడించాడు. నాగేశ్వరరావును పూర్తిగా నమ్మి మోసాన్ని పసిగట్టలేకపోయానని వాపోయాడు.

అనేక ఇబ్బందులు పడి తిరిగి కెనడా నుంచి ఇంటికి చేరుకున్నట్లు తెలిపాడు. అనంతరం నాగేశ్వర్‌రావును నిలదీసి తానిచ్చిన డబ్బులను ఇవ్వాలని కోరగా తాను డబ్బులు ఇవ్వనని, చేతనైంది చేసుకోమని బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించాడు. నాగేశ్వరరావు అతడి భార్య కిరణకుమారిపై తగు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని వీరవెంకటసత్యనారాయణరెడ్డి తన ఫిర్యాదులో పోలీసులను కోరారు. ఈ తరహా బాధితులు గన్నవరం తదితర గ్రామాల్లో కూడా ఉన్నారని, వారు కూడా ఒక్కొక్కరిగా తాము మోసపోయిన తీరుపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నారని సమాచారం.

పెరిగిన ఆర్టీసీ చార్జీలు

» ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు ఒక్కో సర్వీస్‌పై రూ.10 పెంపు

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 12: తెలంగాణలో మరో సారి ఆర్టీసీ బస్సు చార్జీలు పెరిగాయి. హైవేలపై టోల్ చార్జీలు పెంచుతూ కేంద్రం ఇటీవల నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ఆర్టీసీ టికెట్ చార్జీల్లో టోల్ గేట్ రుసుములు పెరిగాయి. టోల్ ప్లాజాలు ఉన్న మార్గాల్లో ప్రయాణించే ఆర్టీసీ బస్సుల్లో రూ.3 చొప్పున చార్జీలు పెరిగాయి. టోల్ గేట్లు ఉన్న రహదారుల్లో ప్రయాణించే ఆర్టీసీ బస్సులు కూడా టోల్ రుసుములు చెల్లించాల్సి ఉంది. కేంద్రం నిర్ణయంతో టోల్ గేట్ చార్జీలు పెరగడంతో ఆర్టీసీ ఆ భారాన్ని ప్రయాణికులపైనే మోపింది. టికెట్ చార్జీల్లో కలిసి ఉన్న టోల్ రుసుములను రూ.3 చొప్పున పెంచింది. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రూ.10గా ఉన్న టోల్‌రుసుమును రూ.13కు, డీలక్స్, సూపర్ లగ్జరీ, రాజధాని, గరుడ, వజ్ర బస్సుల్లో ఉన్న రూ.13ను రూ.16కు, గరుడ ప్లస్ బస్సుల్లో రూ.14 నుంచి రూ.17కు, నాన్ ఏసీ స్లీపర్, హైబ్రీడ్ స్లీపర్ బస్సుల్లో రూ.15 నుంచి రూ.18కి, ఏసీ స్లీపర్ బస్సుల్లో రూ.20 నుంచి రూ.23కు పెంచారు. పెరిగిన చార్జీలు తాజాగా అమల్లోకి వచ్చాయి. ఒక్కో టోల్ గేట్‌కు రూ.3 పెంచినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. పల్లె వెలుగు బస్సుల్లో చార్జీల పెంపు భారం వర్తించదని, టోల్ చార్జీలు పెరిగిన నేపథ్యంలో తెలంగాణ ఆర్టీసీ అధికారులు సైతం బస్సు చార్జీలను పెంచి టిమ్ మిషన్లలో ఆయా మార్పులు చేశారు. అయితే, చార్జీల పెంపుపై ఆర్టీసీ ఎలాంటి ప్రకటనా ఇవ్వకపోవడం గమనార్హం. ఉమ్మడి ఖమ్మం జిల్లా రీజియన్ పరిధిలో మొత్తం ఎక్స్‌ప్రెస్‌లు 43, డీలక్స్‌లు 10, సూపర్‌లగ్జరీలు 67, గరుడ, రాజధాని ఏసీ బస్సులు 33 అందుబాటులో ఉన్నాయి వీటిల్లో రోజు ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో రెండు లక్షల మంది ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. హైదరాబాద్‌కు రోజుకు సుమారు 60 వేల మంది ప్రయాణికులు ప్రయాణం కొనసాగిస్తుంటారు. గతంలో ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్‌లో రూ.290 ఉండగా ప్రస్తుతం రూ.300, డీలక్స్‌లో గతంలో రూ.330 ప్రస్తుతం రూ.340, సూపర్ లగ్జరీలో రూ.380కి ప్రస్తుతం రూ.390, ఏసీలలో రూ.480కి గాను రూ.490గా చార్జీలు పెరిగాయి. పెంచిన చార్జీలను ఆర్టీసీ బుధవారం నుంచే వసూళ్లు చేస్తుంది.

ఇది కేవలం టోల్ చార్జీల పెంపు కారణంగానే పెంచవల్సి వచ్చిందని, ఈ పెంచిన చార్జీల పైకం టోల్‌ప్లాజాలకే సరిపోతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

'సమానత్వంపై బోధనలు ఉండాలి'

సత్తుపల్లిరూరల్, జూన్12: విద్య, వైద్యం, సమానత్వంపై బోధనలు ఉండాలని ఆన్ మైనార్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.ఆదిల్‌షరీఫ్ అన్నారు. బుధవారం సత్తుపల్లిలోని పీవీ.నరసింహారావు సెంటీనరి కాలనీలో సింగరేణి మైనారిటీ ఉద్యోగుల ఆధ్వర్యంలో హిందూ, ముస్లిం, క్రైస్తవ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఉత్తమమైన విద్యకోసం మంచి విద్యాసంస్థలు చూస్తామం కానీ, వాటిని ఏ మతస్థులు నడుపుతున్నారో చూడమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జీఎం షాలెంరాజు, పీవోలు ఎన్వీఆర్.ప్రహ్లాద, ఎంవీ.నరసింహారావు, వెల్ఫేర్ ఆఫీసర్ దేవదాస్, వక్త షేక్.బాసిత్ తదతరులున్నారు.

మహిళా స్వయం సంఘాలకు..

చేయూత

» రద్దయినా, బకాయిలున్న, రికార్డుల నుంచి తొలగించిన సంఘాలకు ఊపిరి

» 2024-25 ఏడాదికి గాను రూ.1113. 31 కోట్ల బ్యాంకు లింకేజీ లక్ష్యం



ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 12: మహిళలు ఆత్మ గౌరవంతో హుందాగా బ్యాంకుకు వెళ్లి డబ్బులు అప్పు తెచ్చుకునేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బ్యాంకు లింకేజీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించింది. జిల్లా స్థాయిలో బ్యాంకు లింకేజీ డీపీఎం అధికారిని ఏర్పాటు చేసి మండల, గ్రామ స్థాయిలోను ప్రత్యేకంగా ఉద్యోగులను నియామకం చేసి మహిళా స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావటానికి లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళా సంఘాల్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రకటించారు. కరోనా వైరస్ ప్రభావంతో గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. సకాలంలో బ్యాంకు లింకేజీలు చెల్లింపులు జరగలేదు. దీంతో పలు సంఘాలు రద్దు కాగా మరి కొన్ని సంఘాలు డిపాల్డర్‌గా నమోదు జరిగాయి. మరి కొన్ని సంఘాలు రికార్డుల నుంచి తొలగిపోయాయి. సకాలంలో బకాయిలు చెల్లించని సంఘాలకు గత ప్రభుత్వంలో బ్యాంకు లింకేజీలు ఇవ్వలేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వంలో తిరిగి మహిళా స్వయం సహాయక సంఘాలకు చేయూత ఇవ్వాలని ముం దుకు వచ్చాయి. రద్దయిన ఎస్‌హెచ్‌జీలు, డిఫాల్డర్ సంఘాలు, రికార్డుల నుంచి తొలగించిన సంఘాలకు ఊపిరి పోయాలని బ్యాంకు లింకేజీ లక్ష్యాలను కేటాయించాయి.

ఖమ్మం జిల్లాలో 25,032 ఎస్‌హెచ్‌జీ సంఘాల ద్వారా 2,58,336 మంది మహిళలు సభ్యత్వం బ్యాంకు రుణాలకు అర్హత పొందారు. ఈ మేరకు ప్రభుత్వం బ్యాంకు లింకేజీ రుణాల లక్ష్యాలను పెంచి కేటాయిస్తోంది.. 2023-24లో ఖమ్మం జిల్లాకు రూ.931.68 కోట్లు కేటాయించగా 2024-25 వ సంవత్సరంలో రూ.1113.31 కోట్ల రుణాలను 21,348 మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇవ్వాలని లక్ష్యాన్ని పెట్టారు.

క్యాష్ క్రెడిట్ లిమిట్

గతంలో ఓ మహిళా సభ్యురాలు రూ.2లక్షలు బ్యాంకు లింకేజీ తీసుకుంటే మొత్తం డబ్బులు చెల్లించే వరకు తిరిగి బ్యాంకులో అప్పులు ఇచ్చే వారు కాదు. కానీ క్యాస్ క్రెడిట్ లిమిట్ మేరకు ఓ సభ్యురాలు బ్యాంకు లింకేజీ తీసుకున్న ఆరు మాసాల తర్వాత తాను చెల్లించిన మొత్తంలో అప్పటి వరకు వడ్డీ పోను మిగిలిన సొమ్మును రుణంగా పొందేందుకు బ్యాంకు లింకేజీలో వెసులుబాటు కల్పించారు. ఇలా ఎన్నిసార్లైనా వ్యక్తిగతంగా సభ్యులు రుణం తీసుకొనే వీలు ఉంది. ఈ విషయాన్ని బ్యాంకు లింకేజీ అధికారులు ఎస్‌హెచ్‌జీలకు అవగాహన కల్పించలేక పోయారు. కాగా, కొందరు సెర్ప్ ఉద్యోగుల అవినీతి వల్ల కూడా మహిళా సంఘాలు బ్యాంకు లింకేజీ అప్పులు తీసుకునేందుకు జంకారనే అభిప్రాయాలు ఉన్నాయి.

బ్యాంకు రుణ లక్ష్యాలు ఇలా..

తిరుమలాయపాలెం రూ.80.82 కోట్లు, ఖమ్మం రూరల్ రూ.76.59 కోట్లు, ముదిగొండరూ.67.44కోట్లు, పెనుబల్లి రూ.66.80కోట్లు, కల్లూరు రూ.64.71కోట్లు, కొణిజర్ల రూ.64.20 కోట్లు, తల్లాడ రూ.63.09కోట్లు, కూసుమంచి రూ.61.72కోట్లు, నేలకొండపల్లి రూ.61.72కోట్లు, రఘునాథపాలెం రూ.54.69 కోట్లు, ఎర్రుపాలేం రూ.50.89కోట్లు, బోనకల్ రూ.50.48కోట్లు, ఏన్కూరు రూ.49.11కోట్లు, వేంసూరు రూ.48.21కోట్లు, చింతకాని రూ.46.19కోట్లు, సత్తుపల్లి రూ.46.09కోట్లు, సింగరేణి రూ.43.84కోట్లు, వైరా రూ.41.12 కోట్లు, కామేపల్లి రూ.40.05 కోట్లు, మధిర రూ.37.93 కోట్లు బ్యాంకు లింకేజీ లక్ష్యంగా కేటాయించారు.

సాగునీటి ప్రాజెక్టుల పనులు వేగంగా చేపట్టాలి

» అధికారులతో సమీక్షా సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి



సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి

ఖమ్మం, జూన్12 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పనులు వేగవతంగా చేపట్టాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు బుధవారం కలెక్టరేట్‌లో ఇరిగేషన్, విద్యా, తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులనుద్దేశించి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రపంచంలో పోటీపడే విధంగా ఖమ్మం జిల్లాను అద్భుతంగా అభివృద్ధి చేయాలని లక్ష్యం పెట్టుకుని అధికారులు పనిచేయాలని సూచించారు. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఎన్ఎస్‌పీ కెనాల్ సీతారామ ప్రాజెక్టులతో పాటు మధ్య, చిన్న తరహా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని, అందుకు అవసరమైన కేలండర్‌ను తయారు చేసి ప్రణాళికాబద్ధంగా ముందుకు పోవాలన్నారు. పండ్రేగుపల్లి ప్రాజెక్టు పనులు సత్వరం ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు దేశానికి ఒక ఆదర్శం కాబోతున్నాయని తెలిపారు ఖమ్మం జిల్లాలో రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి రెవెన్యూ అధికారులు వెంటనే భూములు గుర్తించాలన్నారు. విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఆయా శాఖల ద్వారా అందిస్తున్న స్కాలర్‌షిప్పులు సంఖ్యలను మరో వందకు పెంచాలని నిర్ణయం తీసుకున్నాని తెలిపారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టుల పూర్తికోసం అన్ని సమస్యలు అధిగమించాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరందించే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి మాట్లాడుతూ పాలేరుకు సంబంధించి రూ.20కోట్లతో ఖర్చుతో 18వేల ఎకరాలకు సాగునీరందించవచ్చని తెలిపారు. కలెక్టర్ వీపీ గౌతమ్ సాగునీటి ప్రాజెక్టుల పురోగతి విద్యాశాఖలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు, వాటి పనితీరు గురించి వివరించారు. సమావేశంలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, రాగమయి, ఉప ముఖ్యమంత్రి ఓఎస్డీ కృష్ణభాస్కర్, ఖమ్మం నగర పాలక కమిషనర్ ఆదర్శసురభి, అదనపు కలెక్టర్‌లు మధుసూదన్, సత్యప్రసాద్ , ఇరిగేషన్ సీఈ విద్యాసాగర్ డీఈవో సోమశేఖరశర్మ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యపై ప్రత్యేక దృష్టి

● రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి



పుస్తకాలు పంపిణీ చేస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మంకార్పొరేషన్, జూన్12: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని 60వ డివిజన్(పాలేరు నియోజకవర్గం) రామన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో సన్యాసయ్య ఖమ్మం ఆర్డీవో గణేష్, ప్రత్యేక అధికారి శ్రీరామ్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఎంఈవో శ్రీనివాస్, హెచ్‌ఎం కృష్ణవేణి తదితరులున్నారు.



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న సంభాని

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మాజీమంత్రి సంభాని

సత్తుపల్లి, జూన్12: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా రాజకీయాలు, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై చర్చించినట్లు సంభాని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

బూర్గంపాడు, జూన్ 12: ఐటీఐలో 2024-25 సంవత్సరానికి గానూ ప్రవేశం పొందెందుకు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 14 వరకు సమయాన్ని పొడిగించినట్లు ప్రభుత్వ ఐటీఐ కృష్ణసాగర్ ప్రిన్సిపల్ లక్ష్మణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలని పేర్కొన్నారు.

క్లోరిన్ గ్యాస్ లీకేజీతో పలువురికి అస్వస్థత

దుమ్ముగూడెం, జూన్ 12: మండలంలోని పర్ణశాల అడ్డరోడ్డు వద్ద మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్‌లో బుధవారం ప్రమాదవశాత్తు నీటి శుద్ధికి వినియోగించే క్లోరిన్ గ్యాస్ సిలెండర్ లీకవడంతో పరిసర ప్రాంతానికి చెందిన పలువురు అస్వస్థతకు లోనయ్యారు. భగీరథ సిబ్బంది క్లోరిన్ గ్యాస్ సిలిండర్‌ను మారుస్తున్న క్రమంలో సిలిండర్ నిప్పల్, వాచర్ ఊడిపోయాయి. దీంతో ఒక్కసారిగా పెద్ద ఎత్తున శబ్దం రావడంతోపాటు, సుమారు పదిహేను నిముషాల పాటు గ్యాస్ లీకయ్యింది. శబ్దం విన్న ఆ ప్రాంత ప్రజలు ఉరుకులు, పరుగులు తీశారు. ప్లాంటు పక్కనే ఉన్న తిరుపతమ్మ అనే మహిళ ముక్కు, నోటిలోనుంచి రక్తం రావడంతో ప్రాథమిక చికిత్సలు అందించారు. అలాగే భగీరథ సిబ్బంది నల్లపు కళ్యాణ్ అస్వస్థతకు లోనవడంతో భద్రాచలం ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా లీకైన సిలిండర్ ఖాళీదని తెలుస్తోండగా, నిండుదైతే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా రెండేళ్ల క్రితం భగీరథ సిబ్బంది బోర పవన్‌కుమార్‌రెడ్డి సైతం ఇదే తరహాలో క్లోరిన్ గ్యాస్ లీకవడంతో తీవ్ర అస్వస్థతకు లోనై భద్రాచలం ఆసుపత్రిలో చికిత్సలు పొందాడు.

చర్లలో గంజాయి పట్టివేత

చర్ల, జూన్ 12: ఆంధ్రాప్రాంతం నుంచి ఓ కారులో తరలిస్తున్న గంజాయిని బుధవారం టాస్కుఫోర్స్ అధికారులు భద్రాద్రి జిల్లా చర్ల మండలం కొత్తపల్లి వద్ద పట్టుకున్నారు. ఆంధ్రానుంచి ఓ కారులో ముగ్గురు వ్యక్తులు మూటలుగా కట్టిన గంజాయిని తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో భద్రాచలం వద్ద పోలీసులు తనిఖీలు ప్రారంభించాయి. వాహన డ్రైవర్ పోలీసులను చూసి వాహనాన్ని చర్ల మండలం, కొత్తపల్లి గ్రామం వైపు తీసుకెళ్లాడు. వాహనాన్ని అక్కడ వదిలి ముగ్గురు వ్యక్తులు పరారయ్యారు. భద్రాచలం పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. కాగా ఈ ఘటనపై పూర్తి వివరాలు వెళ్లడిస్తామని, ఫొటోలు తీయొవద్దని పోలీసులు మీడియాకు తెలిపారు. కాగా పట్టుబడ్డ కారులో గంజాయి మాత్రమే ఉందా లేక ఇంకా ఏమైనా వస్తువులు ఉన్నాయా అనే విషయం తెలియాల్సి ఉంది.

లారీ కింద పడి వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం, జూన్12: లారీముందు భాగం తగలడంతో ప్రమాదశాత్తు టైర్ కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం ఖమ్మం నగరంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని పాత మునిసిపల్ కార్యాలయం సమీపంలో నివాసం ఉంటున్న మేడా నాగార్జున(35) అనే వ్యక్తి ద్వి చక్ర వాహనంపై బయటకు వెళ్లి వస్తుండగా శ్రీశ్రీ సర్కిల్ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్ వద్ద వెనుక నుంచి ఓలారీ ద్విచక్రవాహనం హ్యాండిల్‌కు తగలింది. దీంతో అతడు లారీ కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు మృతదేహాన్ని పరిశీలించి అన్నం శ్రీనివాసరావు సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించారు. అనంతరం కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మట్టి ట్రాక్టర్ ఢీకొని బాలుడు..

ఖమ్మం రూరల్ జూన్ 12: మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ తగిలి బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని ముత్తగూడెం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నరేష్ గౌతమి దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు గునుగంటి వీరేందర్(7) రేషన్ తీసుకొచ్చేందుకు తన స్నేహితుడితో కలిసి రేషన్ దుకాణం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ముత్తగూడెం బ్రిడ్జి వద్ద మట్టి ట్రాక్టర్ బాలుడిని ఢీకొనడంతో ట్రాక్టర్ టైర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

వైరా జూన్ 12: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండలంలోని నారపునేనిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారపునేనిపల్లి గ్రామానికి చెందిన సముద్రాల సైదులుకృష్ణ(44) కొత్తగూడెం డీపోలో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజుల నుంచి కుటుంబ కలహాల నెపంతో తన భార్య మధ్య నిత్యం ఘర్షణలు జరుగుతుండడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. కాగా రెండు రోజుల క్రితం తన విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నాడని ఆర్టీసీ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో మనస్తాపం చెందిన ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తక్కువ ధరకు చికెన్ అమ్ముతున్నాడంటూ..

యూనియన్ బాధ్యుల దాడి

» తీవ్రంగా గాయపడిన కూలి..స్టేషన్‌లో ఫిర్యాదు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీను

అశ్వారావుపేట రూరల్, జూన్ 12: యూనియన్ నిర్ణయించిన ధరలకు కాకుండా తక్కువ ధరకు చికెన్ అమ్ముతున్నాడని దుకాణంపై యూనియన్ బాధ్యులు దాడి చేసిన సంఘటన అశ్వారావుపేటలో బుధవారం చోటు చేసుకుంది. బాధితులు వివరాల ప్రకారం.. పట్టణంలోని భద్రాచలం రోడ్‌లో షౌకత్ అనే వ్యాపారి చికెన్ దుకాణాన్ని నడుపుతున్నాడు. అయితే బుధవారం చికెన్ కేజీ రూ.200లకే కొట్టబడును అనే బోర్డును ఏర్పాటు చేశాడు. బోర్డును చూసిన సంఘం బాధ్యులు హేమంత్, మరో నలుగురు కలిసి అంతా రూ.280 అమ్ముతుంటే మీరు ఎందుకు తక్కువకు అమ్ముతున్నారని, వెంటనే బోర్డును తీసేయాలని సూచించారు. అయితే ఆసమయంలో దుకాణ యజమాని లేకపోవడంతో దుకాణంలో పనిచేసే శ్రీనివాసరావును బోర్డును తొలిగించాలని చెప్పగా, తాను తన యజమాని చెప్పినట్లే చేస్తానని, బోర్డును తీసేయని చెప్పాడు. దీంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈక్రమంలో యూనియన్ నాయకులు అతడిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స అనంతరం తనపై దాడికి పాల్పడిన వ్యక్తులపై చర్య తీసుకోవాలని కోరుతూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే యూనియన్ నాయకులు కూడా పోలీస్‌స్టేషన్‌లో శ్రీనుపై ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం.

మల్బరీ సాగుతో అధిక ఆదాయం

ఖమ్మంవ్యవసాయం, జూన్12: రైతులు సాంప్రదాయ పంటలతో నష్టపోకుండా పట్టుపరిశ్రమ ద్వారా అధిక ఆదాయాన్ని నెలవారీగా పొంది రైతులు అభివృద్ధి సాధించాలని ఖమ్మం ఉద్యాన మరియుపట్టు పరిశ్రమశాఖ అధికారి బీవీ రమణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా మల్బరీ సాగుకు రైతులు ముందుకు రావాలని కోరారు. తక్కువ నీటి వినియోగంతో ఏడాదిలో ఎక్కువ పంటలు సాగుచేసుకోవచ్చన్నారు.

జిల్లాలో మల్బరీ సాగు రైతులకు ఆశాజనకంగా మారిందన్నారు. రాష్ట్రంలో జనగాం, హైదరాబాదు మార్కెట్లలో నాణ్యతను బట్టి రూ.600 వరకు ధర కూడా పలుకుతుందని ప్రకటనలో తెలిపారు.

కబేళాకు తరలిస్తున్న 105 పశువులు పట్టివేత

● 8 మందిపై కేసు నమోదు

మణుగూరు, జూన్ 12 : అక్రమంగా కబేళా లకు 105 పశువులను తరలిస్తున్న వారిని పోలీసులు పట్టుకున్నారు. మణుగూరు సీఐ సతీష్‌కుమార్ బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. చర్ల, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి 81 ఆవులు 24 ఎద్దులను నాలుగు వాహనాల్లో గోదావరి దాటించి మణుగూరులో రహస్య స్థలంలో ఉంచారు. వీటిని హైదరాబాద్ కబేళాకు తరలించే ప్రయత్నం చేస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ మేడ ప్రసాద్, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. గోవులను ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్న 8 మందిని అరెస్టు చేసి తరలించేందుకు వాడుతున్న నాలుగు వాహనాలను సీజ్ చేశామన్నారు. వీరిలో ఇద్దరు కోదాడ, ఇద్దరు హైదరాబాద్, మిగిలిన వారు మోరంపల్లిబంజర, మణుగూరు చెందిన వారిగా గుర్తించడం జరిగిందన్నారు. మహ్మద్ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.



వాహనాల్లో తరలిస్తున్న ఆవులు

జోరుగా కలప రవాణా

» చర్లలో మళ్లీ దొరికిన టేకు మొద్దులు » రెండు రోజుల్లో రూ.8లక్షల కలప స్వాధీనం



తేగడ వద్ద పట్టుబడిన కలప

చర్ల, జూన్ 12: చర్ల మండలంలో, లారీతో కలప పట్టుబడ్డ మరుసటి రోజే, మరో వాహనంలో తరలిస్తున్న భారీ 6టేకు దుంగలు పట్టుబడ్డాయి. చర్ల మండలం తిప్పాపురం నుంచి తరలిస్తున్న కలపను తేగడ వద్ద అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రెండు రోజుల వ్యవధిలో సుమారు రూ.8 లక్షల కలపను అధికారులు పట్టుకున్నారు. అక్రమ కలప రవాణా వ్యవహారంలో చర్ల రేంజ్ అధికారి ఉపేందర్ విచారణ చేపట్టారు. లారీ పట్టుబడిన వ్యవహారంలో వద్దిపేటలో గ్రామంలో విచారణ జరిపి, ఓ చోట దాచి ఉంచిన కోత విషన్‌ను స్వాధీనం చేసుకున్నారు. తాజాగా పట్టుబడ్డ కలప విషయంలో తిప్పాపురం వెళ్లి ఆరా తీశారు. కాగా ఇంత భారీగా కలప పట్టుబడ్డం ఇదే మొదటి సారి. కలప దొరకడంతో టేకు అక్రమ రవాణా ఒక్కసారిగా తెరపైకి వచ్చింది.

చర్ల మండలంలోని పూసుగుప్ప, ఉంజుపల్లి, కొయ్యూరు, సుబ్బంపేట, గీసరెల్లి, కొర్కట్‌పాడు, పెద్దమిడిసిలేరు, బత్తినిపల్లి, కుర్నపల్లి గ్రామాల్లో 1960 టేకు ప్లాంటేషన్లు ఉన్నాయి. ఆయా ప్లాంట్లలో భారీ టేకు వృక్షాలు ఉన్నాయి. మేలైన కలప ప్లాంటేన్లలో కనిపిస్తుంది. అలాగే చర్ల మండలం ఆనుకుని ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్, సుకుమా జిల్లాల అడవుల్లో కూడా భారీగా టేకు వృక్షాలు ఉన్నాయి. ఒక్కో చెట్టు వయస్సు సుమారు 60 నుంచి 100 సంవత్సరాలు కూడా ఉంటుంది. కాగా అక్రమమార్కుల కన్ను ఈ చెట్లపై పడ్డట్లు తెలుస్తోంది. చెట్లను నరికి కొద్ది రోజుల తరువాత వాటిని సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ కలప ఎక్కడిది, ఎక్కడికి పోతుంది?

లారీలో పట్టుబడ్డ కలపను ఎక్కడి నుంచి తీసుకొచ్చారు అనేది మిస్టరీగా మారింది. సుమారు 260 చెక్కలను తరలిస్తుంటే కనీసం ఎవ్వరికీ తెలియకుండా ఉంటుందా అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ప్రతీ రోజూ విధులు నిర్వహించే అటవీశాఖ సిబ్బందికి కనీసం తెలియలేదా, అనే ప్రశ్నలు కూడా ఇప్పుడు రేకెత్తుతున్నాయి. కాగా ఇంత భారీ టేకు చెక్కలు తెలంగాణ అడవుల్లోనివా..! లేక ఛత్తీస్‌గఢ్ నుంచి తీసుకొచ్చారా అనేది తెలియాల్సి ఉంది. అలాగే లారీలో పట్టుకుని పోతున్న కలప ఎక్కడికి పోతుంది, సైజులుగా కోసిన కర్రలు ఎక్కడికి చేర వేస్తున్నారు అనేది మిస్టరీగా మారింది.

విచారణ జరిపిన రేంజర్

వద్దిపేట కలప వ్యవహారంలో బుధవారం చర్ల రేంజ్ అధికారి ఉపేందర్ సిబ్బందితో వద్దిపేట గ్రామం వెళ్లి స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఓ పాకలో ఉన్న కటింగ్ మిషనరీని స్వాధీనం చేసుకున్నారు. కలప ఛత్తీస్‌గఢ్ నుంచి తీసుకొచ్చి రవాణా చేస్తున్నట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చామని, విచారణ జరిపి పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. అలాగే తిప్పాపురం కలప వ్యవహారంలో విచారణ జరుపుతున్నామని, డ్రైవర్ పరారయ్యాడని తెలిపారు.

అక్రమ కలప వ్యవహారం చర్ల మండలంలో చర్చనీయాశంగా మారింది. మంగళవారం వద్దిపేట నుంచి లారీలో తరలిస్తున్న కలప విలువ రూ.6లక్షల 50,805 ఉండగా, బుధవారం ఉదయం పట్టుబడిన కలప విలువ రూ.లక్షా 30వేలు ఉందని ఫారెస్టు అధికారులు చెబుతున్నారు. రెండు రోజుల్లో సుమారు రూ.8 లక్షల కలపను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కాగా ఇంత భారీ మొత్తంలో అక్రమ కలప పట్టుబడ్డంతో స్థానికులు ఇదే విషయం చర్చిస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో రిపేరుకు వచ్చి..

● విద్యుదాఘాతంతో ప్రైవేటు ఎలక్ట్రీషియన్ మృతి

● మృతదేహంతో బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన



సతీష్(ఫైల్)

కొణిజర్ల, జూన్ 12: విద్యుదాఘాతంతో ఓ ప్రైవేటు ఎలక్ట్రీషియన్ మృతి చెందిన ఘటన బుధవారం ఖమ్మం జిల్లా కొణిజర్లలో జరిగింది. వైరా మండలం గొల్లపుడి గ్రామానికి చెందిన నారగాని సతీష్(28) ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తుంటాడు. ఈ క్రమంలో కొణిజర్ల ఆయుర్వేద ఆసుపత్రిలో విద్యుత్ సమస్య ఉండటంతో ఆసుపత్రిలో పని చేసే సిబ్బంది ఒకరికి సతీష్‌తో పరిచయం ఉండటంతో మరమ్మతులు చేయాలని పిలిపించారు. ఆసుపత్రి ముందు ఉన్న షెడ్డు వద్ద సతీష్ విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ గురై షెడ్డుకు ఉన్న ఇనుపజాలిపై పడిపోయాడు. అక్కడే ఉన్న స్థానికులు వెంటనే ఓ కర్ర సహాయంతో అతడిని కిందకు దింపారు. తరువాత అక్కడున్న ఇద్దరు వ్యక్తులు అతడికి సీపీఆర్ చేశారు. దాంతో సతీష్‌కు స్పృహ వచ్చినట్లు అనిపించడంతో వెంటనే ఓ కారులో ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అక్కడ పరీక్షించిన వైద్యులు అతడు మృతి చెందిన్నట్లు తెలిపారు. దాంతో బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు కొణిజర్లలో ఘటన జరిగిన ఆయుర్వేద ఆసుపత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. ఆయుర్వేద ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం వల్లనే నిండుప్రాణం పోయిందని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గంటపాటు ఆందోళన చేసినా ఆసుపత్రి సిబ్బంది ఎవరూ రాకపోవడంతో మృతదేహంతో మెయిన్‌రోడ్డుకు వెళ్లి రోడ్డుపై మృతదేహాన్ని ఉంచి ఆందోళనకు దిగారు. ఆయుర్వేద ఆసుపత్రికి అనుకునే ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఉందని, ఒక మనిషి చావుబతుకులతో ఉన్నా కనీసం సీపీఆర్ చేయటానికి కూడా వారు రాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన సతీష్ కుటుంభానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అరగంటకు పైగా ఆందోళన చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కాగా ఆస్పత్రి వర్గాలతో మృతుడికి కుటుంబానికి సహాయం చేసి, ఉద్యోగం కూడా ఇవ్వాలని చర్చలు జరుపుతున్నారు. మృతుడికి భార్య సుధారాణి, ఏడాది పాప ఉన్నారు.

మృతుడి తల్లిదండ్రులు నారగాని నాగేంద్ర, నాగమణిలు ఇద్దరు సరిగా పని చేయలేని దివ్యాంగులు. సతీష్ ప్రైవేట్ ఎలక్ట్రీషీయన్‌గా పని చేసి తల్లిదండ్రులను పోషిస్తున్నాడు. కొన్ని నెలలుగా ఖమ్మంలో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబాన్ని పోషించే సతీష్ మృతి చెందడంతో కుటుంబ పరిస్థితి ఏమిటని బంధువులు రోధిస్తున్న తీరు అందరిని కలిచివేసింది.

మృతుడి భార్యకు ఔట్ సోర్సింగ్‌లో ఉద్యోగం కల్పిస్తామని ఆర్డీవో గణేష్, డీఎంహెచ్‌వో మాలతి హామీ ఇచ్చారు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.

అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

● బంగారు అభరణాలు, కారు, ద్విచక్రవాహనం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

అన్నపురెడ్డిపల్లి, జూన్ 12: మండలంలో ఆరుగురు అంతరాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం మండలంలో విలేకరుల సమావేశంలో సీఐ ఇంద్రసేనారెడ్డి వివరాలు వెల్లడించారు. మంగళవారం రాత్రి ఎస్ఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో మండలంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో ఓ కారులోని వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకోని విచారించగా వారు అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల్లో చోరీకి పాల్పడినట్లు అంగీకరించారన్నారు. చోరీకి పాల్పడిన వారు ఆంధ్రరాష్ట్రంలో గుడివాడకి చెందన యలమర్తి నాని, రాగుర్తి దుర్గాప్రసాద్, కర్ర లాజర్, అబ్బూరి వెంకటేశ్వరరావు, ఎం.రామకోటేశ్వరరావులతో పాటు మైనర్ బాలుడు ఉన్నారని తెలిపారు. వారి వద్ద నుంచి రూ1.44లక్షల విలువైన బంగారు అభరణాలు, కారు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

'డ్రైవర్‌ను కొట్టిన కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలి'

ఇల్లెందుటౌన్, జూన్ 12: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని కోయగూడెం ఓసీలో అంబులెన్స్ కాంట్రాక్టర్ డ్రైవర్ తాటి బిక్షాన్ని పోలీస్ కానిస్టేబుల్ విచక్షణ రహితంగా కొట్టడాన్ని నిరసిస్తూ బుధవారం కాంట్రాక్టు డ్రైవర్లు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. జీఎం కార్యాలయంలోని పర్సనల్ మేనేజరుకు వినతిపత్రం అందజేశారు. సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కే. యాకూబ్‌షావలి మాట్లాడుతూ మంగళవారం రాత్రి 11గంటల సమయంలో టేకులపల్లి ఐటెక్‌కాలనీకి అంబులెన్స్ పంపించాలని సింగరేణి అధికారి కోరగా అంబులెన్స్ ఐటెక్‌కాలనీకి వెళ్లగా ఈ సందర్భంలో అంబులెన్స్ ఎక్కనని అధికారి మోరాయించి టేకులపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. డ్రైవర్‌పై అధికారి ఫిర్యాదు చేయడంతో డ్రైవర్‌ను స్టేషన్‌ను పిలిపించిన కానిస్టేబుల్ డ్రైవర్‌ను చితకబాదారని ఆరోపించారు. ఈ విషయంపై సింగరేణి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ ఇల్లెందు ఏరియా కార్యదర్శి మల్లెల వెంకటేశ్వర్లు, డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు రాజేష్, రవీందర్, సోహెల్, సీతారాములు,నరేష్, శ్రీధర్, బబ్లు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.






ములకలపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే, మణుగూరులో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం, ఇల్లెందులో బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం, భద్రాచలంలో పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం

ఉన్నత లక్ష్యంతో విద్యనభ్యసించాలి

- బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావ్
- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యా బోధన ఉంటుందని వెల్లడి
- తెరుచుకున్న బడులు

అశ్వారావుపేట/ అశ్వారావుపేట రూరల్, జూన్ 12: ఉన్నతమైన లక్ష్యంతో కష్టపడి చదివితే ఏదైన సాధించవచ్చని, విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుంటూ ఆదిశగా ముందుకు సాగాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. వేసవి సెలవుల అనంతరం బుధవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. అశ్వారావుపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, మైనారిటీ గురుకులంతో జరిగిన బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులను పంపిణీ చేశారు. పాఠశాల విద్యార్థులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలకగా ఉపాధ్యాయులు సత్కరించారు. సమావేశంలో ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగానికి ఎనలేని కృషిచేస్తుందని తెలిపారు. పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.కోట్ల నిధులను ఖర్చు చేస్తుందని తెలిపారు. ఇప్పటికే అనేక పాఠశాలల్లో పనులు కూడా పూర్తయ్యాయని తెలిపారు. బడిఈడు పిల్లలందరూ తప్పకుండా బడిలోనే చేరాలని సూచించారు. బాలిక కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

దమ్మపేట: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించటమే ప్రభుత్వ లక్ష్యమని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. బడిబాట కార్యక్రమంలో బాగంగా దమ్మపేట జడ్పీపాఠశాల, గిరిజనగురుకులపాఠశాల-కళాశాల, పార్కలగండి ఆశ్రమ గిరిజన బాలుర పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమాలలో పాల్గొన్నారు. మందలపల్లి గిరిజన గురుకుల పాఠశాలలో ఎమ్మెల్యే రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ సోయం ప్రసాదు, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు ఎంఈవో లక్ష్మి, ఆయా పాఠశాలల హెచ్‌ఎం లు, ధర్మా, మస్తాన్, ఉపాధ్యాలు, కాంగ్రెస్ నాయకులు కోయ్యల అచ్యుతరావు, కేవి సత్యనారాయణ, చిన్నంశెట్టి యుగంధర్, కక్కిరాల రమేష్, పగడాల రాంబాబు, మద్దిశెట్టి సత్యప్రసాదు, దొడ్డా బాస్కరరావు, పాకనాటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పేర్కొన్నారు. బుధవారం మండలకేంద్రమైన అన్నపురెడ్డిపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ, తహసీల్దార్ జగదీశ్వరప్రసాదు, ఎంపీడీఓ మహాలక్ష్మి, నాయకులు పర్సా వెంకటేశ్వరరావు, వనమా గాంధీ, వేముల రమణ, గఫార్, రవి, దుబాకుల రాము, లాలయ్య, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితతలు పాల్గొన్నారు.

బడిబాటలో పాల్గొన్న ఎమ్మెల్యే జారె

ములకలపల్లి : మండలంలోని జగన్నాధపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బడిబాట కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

●చంద్రుగొండ: చంద్రుగొండలో జరిగిన బడిబాట కార్యక్రమంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు. బుధవారం చంద్రుగొండ జిల్లా పరిషత్, సెయింట్ జోసెఫ్ పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని విదార్థులు దుస్తులు అందచేశారు. చంద్రుగొండ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల కూర్చొవటానికి ప్లాట్‌ఫామ్, మరుగుదొడ్ల మరమత్తులకు నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పథకాలు వినియోగించుకోవాలి: ఎమ్మెల్యే పాయం

పుస్తకాలు, యూనిఫాం పంపిణీ

మణుగూరు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని కూనవరం జడ్పి ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే పాయం విద్యార్థులకు పుస్తకాలు యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో వీరస్వామి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య: ఎమ్మెల్యే కోరం

ఇల్లెందురూరల్: ప్రభుత్వ పాఠశాలలో కార్పోరేట్ పాఠశాలల స్థాయిలో నాణ్యమైన విద్యబోధన అందిస్తున్నట్లు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు.బుధవారం ఇల్లెందు మండలం చల్లసముద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాల జరిగిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సుదిమళ్లలో జరిగిన బాడిబాట కార్యక్రమంలో ఎంపీపీ చీమల నాగరత్నమ్మ విద్యార్థులకు పుస్తాకాలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సూర్యనారాయణ, ఎంఈఓ పిల్లి శ్రీనివాసరావు, ఎంపీడీఓ దన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

●ఇల్లెందుటౌన్: పేద విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. బుధవారం ఇల్లెందు పట్టణంలోని బాలికల పాఠశాల, మెయిన్ రోడ్డు పాఠశాలల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, టీవీఆర్‌ఎన్. స్వామి, ఎల్. రాంబాబు, కౌన్సిలర్లు కటకం పద్మావతి, నవీన్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు మండల రాము తదితరులు పాల్గొన్నారు.

నేనూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినే: ఎమ్మెల్యే తెల్లం

●భద్రాచలం: నేను చిన్నప్పటి నుంచి ఎంఎస్ చేసి వైద్యున్ని అయ్యే వరకు నా విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ పాఠశాల, కళాశాల, వైద్యకళాశాలల్లోనే సాగిందని, ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాల నుంచే తమ విద్యాజీవితాన్ని ప్రారంభించాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా బుధవారం భద్రాచలంలో జగదీష్‌కాలనీ ప్రాథమికోన్నత పాఠశాల, నన్నపనేని పాఠశాలల్లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొని మాట్లాడారు.కార్యక్రమాల్లో ఎంఈవో సమ్మయ్య, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎస్‌ఎన్‌వి రాజా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బడిబాట..

అశ్వారావుపేట రూరల్: అంగన్‌వాడీల అమలవుతున్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●ఆళ్లపల్లి: ఆళ్లపల్లిలో జరిగిన బడిబాట కార్యక్రమంలో ఎంపీపీ కొండ్రు మంజుభార్గవి పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జడ్పీటీసీ హనుమంతరావు, వైస్‌ఎంపీపీ రేసు ఎల్లయ్యఎంపీడీవో రమాదేవి, ఎంపీవో శ్రీనివాస్, పిహెచ్‌సీ వైద్యులు రేవంత్, ప్రధానోపాధ్యాయులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సదుపాయాలను సద్వినియోగం చేసుకోండి

●దుమ్ముగూడెం: ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న ఉచిత సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రేసు లక్ష్మి, జడ్పీటీసీ సీతమ్మ కోరారు. అచ్యుతాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం యూనిఫాం, పాఠ్యపుస్తకాలనందజేశారు. ఎస్‌ఎంసీ కమి టీ చైర్మన్ ముత్యాలక్క, హెచ్‌ఎం ఏజే ప్రభాకర్, గ్రామస్తులున్నారు.

●లక్ష్మీదేవిపల్లి: లక్ష్మీదేవిపల్లి మండలంలో జరిగిన బడిబాట కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా సోనా, టీచర్ శౌరీ ఇన్నయ్య, వివేకానంద యూత్ అధ్యక్షులు లగడపాటి రమేష్, భవిత కేంద్రం టీచర్లు జానకీ, స్వప్న, కళ్యాణి, విద్యార్థుల తల్లి దండ్రులు ఉపేందర్, సుశాంత్, రాజు, వెంకటేశ్వర్లు, డాక్టర్ చాంద్‌పాషా, మాధవి, స్రవంతి, అనూష, శిరీష, మాధవి, సాంబయ్య, వరలక్ష్మి, రాధిక, భాగ్యలక్ష్మి, రమాదేవిపాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి

●జూలూరుపాడు: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రాష్ట్ర ప్రభుత్వం సర్కారు పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించి విద్యాబోధన అందిస్తుందని సెర్ప్ జిల్లా డీపీఎం రమాకాంత అన్నారు. బుధవారం జూలూరుపాడు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ఎంపీపీ లావుడ్యా సోనితో కలసి విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో జడ్పిటీసీ భూక్య కళావతి, మండల నోడల అధికారి సంజీవరావు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు లక్ష్మీ నర్సయ్య, ఎస్‌కె. మీరా, సెర్ప్ ఏపీఎం సత్యనారయణరాజు, సీసీ ధారావత్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు పంపిణీ

●చుంచుపల్లి, జూన్12: 2024-25 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు, పాఠశాల యూనీఫాంలను కలెక్టర్ ప్రియాంక, జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు పంపిణీ చేశారు. బుధవారం మండలంలోని విద్యానగర్‌కాలనీలో గల ప్రాథమిక పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా పంపిణీ చేపట్టారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత విద్యను అందిస్తున్నారని, ప్రతి తల్లిదండ్రులు, సంరక్ష కులు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలన్నారు. పంపిణీ కార్యక్రమంలో చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి, డీఆర్‌డివో పీడి విద్యా చందన, చుంచుపల్లి తహసీల్దార్ కృష్ణ, ఎంపిడివో అశోక్‌కుమార్, ఎంపీవో గుంటి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కార్పోరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

భద్రాచలం: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను అభివృద్ధి చేస్తున్నారని పట్టణ ప్రముఖులు గాదె మాధవరెడ్డి అన్నారు. భద్రాచలంలోని జడ్పీ బాలికల పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాధవరెడ్డి మాట్లాడు తూ ఈ పాఠశాల పదో తరగతి ర్యాంకుల్లో జిల్లాలోని కార్పొరేట్ పాఠశాలలతో పోటీ పడుతుందన్నారు. మొదటిస్థానంలోనే నిలుస్తుందని అన్నారు. యూనిఫాం, బుక్స్ తొలి రోజే ఇచ్చి విద్యార్థులను ప్రోత్సహించడం మంచి పరిణామం అన్నారు. అనంతరం మాధవరెడ్డికి పాఠశాల తరఫున ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తోటమళ్ల రమ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటన

- సీతారామ ప్రాజెక్టు, సీతమ్మసాగర్‌ను సందర్శించనున్న మంత్రులు

కొత్తగూడెం, జులై 12 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గురువారం డిప్యూటి ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించనున్నారు. జిల్లాలోని అశ్వాపురం మండలంలో నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు, సీతమ్మసాగర్ ప్రాజెక్టులను నలుగురు మంత్రులు సందర్శించనున్నారు. ఖమ్మం నుంచి హెలిక్యాప్టర్ ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వాపురం మండలం అమ్మగారిపల్లికి ఉదయం 11గంటలకు చేరుకుంటారు. అక్కడ సీతారామ ప్రాజెక్టు వ్యూ పాయింట్ నుంచి పరిశీలించనున్నారు. ఉదయం 11. 30నుంచి 11.45 వరకు సీతారామ లిఫ్టు ప్రాజెక్టు రెగ్యూలేటర్‌ను పరిశీలించనున్నారు. బీజీకొత్తూరులోని పంపుహౌస్‌ను పరిశీలించినున్నారు. పూసుగూడెంలోని పంపుహౌస్ నిర్మాణ పనులను పరిశీలించనున్నారు.మధ్యాహ్నం భోజనం అనంతరం సీతారామ ప్రాజెక్టు, సీతమ్మసాగర్‌ల నిర్మాణంపై అధికారులు పవర్‌పాయింట్ ప్రాజంటేషన్ ద్వారా మంత్రులకు వివరించనున్నారు. అనంతరం 3గంటల నుంచి ములకలపల్లి మండలం పూసుగూడెం కాల్వల, మూడు పంపు హౌస్‌లను పరిశీలించనున్నారు. సాయంత్రం 4గంటలకు అశ్వాపురం నుంచి హెలిక్యాప్టర్ ద్వారా ఖమ్మం జిల్లాలోని ఏన్కూరు మండలానికి వెళ్లి సీతారామ ప్రాజెక్టు లింకు కెనాల్‌ను పరిశీలించనున్నారు. అనంతరం సాయంత్రం 6 .30గంటలకు హెలిక్యాప్టర్ ద్వారా హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. ఈ మంత్రుల పరటనలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, నీటిపారుదలశాఖ అధికారులు పాల్గొంటారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలి

పాల్వంచ టౌన్, జూన్ 12 : పట్టణపరిధిలో తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండ అధికారులు చర్యలు తీసుకోవాలని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అధికారులను కోరారు.. పాత పాల్వంచలోని ఏరియాలో భగీరథ లైన్లు వేయక తాగునీరు రావడం లేదని, కొన్ని ప్రాంతాల్లో లైన్లు వేసి మంచినీరు రావడం లేదని స్థానిక మహిళలు కొత్వాలకు ఫిర్యాదు చేశారు. దీంతో బువారం ఆయా ప్రాంతాల్లో కొత్వాలపర్యటించి సంబంధిత అధికారులను పిలిపించి మాట్లాడారు. సంబంధిత అధికారులను ప్రజలు ఇబ్బంది పడకుండ త్వరితగతిన మంచినీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ డీఈ శ్రీనివాస్, సూపర్‌వైజర్ వెంకటేష్, మున్సిపల్ వాటర్ సప్లై ఆపరేటర్ యూసుబ్, స్థానికులు ఎస్‌కే. రెహ్మాన్, ఖాజామోయినుద్దీన్, శ్రీదేవి, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

పినపాక, జూన్ 12: మండలంలోని ఏడూళ్లబయ్యారం గ్రామానికి చెందిన కటుకోజుల వేణుగోపాల్ 4 ఏళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకునేందుకు స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న ఆ కుటుంబాన్ని బుధవారం 'జనం కోసం మనం' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గూడురు కృష్ణారెడ్డి, సంస్థ సభ్యులు పరామర్శించారు బాధిత కుటుంబానికి రూ.5 వేలు నగదు, అర క్వింటా బియ్యం, నిత్యావసరాలను అందించారు. వేణుగోపాల్ వైద్య ఖర్చులకు కనీసం రూ.4 లక్షలు వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపినట్లు బాధితుడు వేణుగోపాల్ తెలిపారు. సాయమందించిన స్వచ్ఛంద సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు గుంటక శ్రీనివాసరెడ్డి, బండారు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరులో జనసేన భారీ ప్రదర్శన



మణుగూరులో జనసేన అభిమానుల ర్యాలీ

మణుగూరు, జూన్ 12: మణుగూరు పట్టణంలో జనసేన యూత్ బుధవారం భారీ మోటార్ సైకిల్, ఆటోల ప్రదర్శన నిర్వహించారు. పినపాక నియోజకవర్గంలోని జనసేన, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు వందల సంఖ్యలో హనుమాన్ టెంపులుకు చేరుకుని ద్విచక్ర వాహనాలకు జనసేన పవన్ జెండాలను కట్టుకుని సురక్షా బస్టాండ్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్లలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. జనసేన యూత్ సభ్యులు కాట్రగడ్డ సరేందర్ నాయుడు, శ్రీనివాస్, జెట్టి విజయేందర్; ప్రదీప్,ముకుందరావులు, కృష్ణమోహన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో తన అభిమాన నటుడు, జనసేనాని పవన్ కళ్యాణ్ మరుపులేని రాజకీయలకు సృష్టికర్తగా మారి తెలుగు దేశం పార్టీకి చోదుడును అందించారని తెలిపారు. కార్యక్రమంలో మణుగూరు మున్నూరు కాపు సంఘ సభ్యులు, జనసేన, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్

రైతులు పొలాల్లో నీటి కుంటల నిర్మాణాలు చేపట్టాలి: ఎంపీడీవో

జూలూరుపాడు, జూన్ 12: ఉపాధి పథకం నిధులతో ప్రతీ పంచాయతీలో రైతులు పొలాల్లో నీటి నిల్వ కుంటల నిర్మాణాలను చేపట్టాలని ఎంపీడీవో కరుణాకరరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలల్లో ఇంకా ఎవరైన ప్రజలు ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు నిర్మించకుంటే అలాంటి వారిని గుర్తించి వాటిని నిర్మించే విధంగా సిబ్బంది కృషి చేయాలని అన్నారు. మండలంలోని 24 పంచాయతీ పరిధిలో రైతులు 100 ఎకరాల విస్తీర్ణంలో పండ్ల తోటల సాగు చేపట్టే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఈజీఎస్ మండల ఏపీఓ రవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

12 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

జూలూరుపాడు, జూన్ 12: మండలంలోని పాపకొల్లు గ్రామంలో రెండు ఇళ్లల్లో అక్రమంగా నిల్వచేసిన 12 క్వింటాల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే జడలచింత గ్రామానికి చెందిన గరికె రామారావు, పాపకొల్లుకు చెందిన కొట్టే నరసింహారావులు ప్రజల వద్ద నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి గదుల్లో నిల్వ చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు ఎస్ఐ జీవన్‌రాజు తన సిబ్బందితో కలసి పాపకొల్లు గ్రామంలోని రెండు ఇళ్ళలో సోదాలు చేశారు. దీంతో 12 క్వింటాల రేషన్ బియ్యం పట్టుబడటంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లై అధికారులకు సమాచారాన్ని అందించి పట్టుబడిన బియ్యాన్ని గుండెపుడి చౌక దుకాణానికి తరలించారు. వారిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

పాల్వంచ, జూన్ 12 : నకిలీ విత్తనాలను ప్రభుత్వం అరికట్టాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పాల్వంచ డిప్యూటీ తహసీల్దార్ తిరుమలకు వినతిపత్రం అందజేశారు. నాయకులు జక్కుల రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పోటీ మార్కెట్‌లో నకిలీ విత్తనాలు అమ్మడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, అయినప్పటికీ అధికారులు వ్యాపారస్తులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. రైతులను ఆదుకునే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి సోమ వినోద, నాయకులు ఈరమ్మ, ఐఎఫ్‌టీయు జిల్లా నాయకులు మంకెన వెంకటేశ్వర్లు, దుర్గాప్రసాద్, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలు చేపట్టాలి

దుమ్ముగూడెం జూన్ 12: మండలంలో అక్రమ మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని ప్రజాపంథా పార్టీ నాయకులు బుధవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎటువంటి అనుమతుల్లేకుండా అర్ధరాత్రి వేళల్లో ఎక్సకవేటర్ల సాయంతో ట్రాక్టర్లపై నిత్యం మట్టిని తరలిస్తున్నారని తెలిపారు. ప్రజాసంపదను దోచుకోకుండా చర్యలు చేపట్టాలని కోరారు. మండల కార్యదర్శి సాయన్న, చరణ్, రామిశెట్టి, తిరుపతిరావు, వీరాస్వామి తదితరులున్నారు.

తాగునీటి సరఫరాపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: కలెక్టర్



మునిసిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్

కొత్తగూడెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి)/పాల్వంచ: తాగునీటి సరఫరాపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అధికారులను హెచ్చరించారు. బుధవారం పాల్వంచ పట్టణ పరిధిలోని ప్రశాంతకాలనీ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు కలెక్టర్‌తో తమ కలనీ సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్ళారు. అదే సమయంలో తమ కాలనీలో మంచినీటి సరఫరా సరిగా జరగడంలేదని ఫిర్యాదు చేసారు. ఈ విషయంపై మునిసిపల్ డీఈ మురళీకృష్ణను ఆమె వివరణ కోరగా మంచినీటి సరఫరా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నామని వివరణ ఇచ్చారు. దీంతో సంతృప్తి చెందని కలెక్టర్ నేరుగా కాలనీ వాసులను అడుగగా మంచినీటి సరఫరా జరగడంలేదని చెప్పారు. దీంతో ఆమె ఆగ్రహించి తప్పుడు సమాచారం అందించినందుకు మునిసిపల్ డీఈ మురళీకృష్ణకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ విద్యాచందనను ఆదేశించారు. తక్షణమే మంచినీటి సరఫరాను పునరుద్ధరించి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

రిజర్వ్ ఫారెస్ట్‌లో చెట్లు నరికిన వారిపై కేసు

ములకలపల్లి, జూన్ 12: ములకలపల్లి మండలం తిమ్మంపేట సెక్షన్ చలమన్ననగర్ బీట్‌లో రిజర్వ్ ఫారెస్ట్‌లో చెట్లు నరికినందుకు బుధవారం కేసు నమోదైంది. ములకలపల్లి రేంజర్ తెలిపిన వివరాల ప్రకారం తిమ్మంపేట రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో కంపోర్టుమెంట్ 341లో చెట్లు నరకుతుండగా వ్యక్తులను పట్టుకుని విచారించగా ఆర్‌ఓఎఫ్ఆర్ హక్కు పత్రాలు ఇచ్చిన ఏరియలో చెట్లు బాగు చేసుకుంటున్నామని అన్నారు. ఆ ప్రాంతంలో ఫారెస్ట్ సిబ్బంది సర్వే చేయగా ఆర్‌వోఆర్ఆర్ హక్కు ప్రాంతం కాకుండ ఇతర ప్రాంతంలో మారుజాతి చెట్ల కొలతలు తీసుకుని నలుగురిపై కేసు నమోదు చేశామనిఅన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో నీలమయ్య, ఎఫ్‌బీవో భాస్కర్ ఉన్నారు.

బాబు సీఎంగా ప్రమాణస్వీకారంతో టీడీపీ శ్రేణుల సంబురాలు

జూలూరుపాడు, జూన్ 12: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నాల్గోవ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయటంతో బుధవారం జూలూరుపాడులో టీడీపీ ఆధ్వర్యంలో శ్రేణులు సంబరాలు నిర్వహించారు. చంద్రుగొండ క్రాస్ రోడ్డు వద్ద ఎన్‌టీఆర్ విగ్రహానికి టీడీపీ, బీఆర్‌ఎస్ నాయకులు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. బాణాసంచా కాల్చారు. కేకును కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా అన్నారుపాడు గ్రామంలో పార్టీ జెండాన్ని నాయకులు ఎగర వేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకులు రోకటి రంగారావు, తుమ్మలపల్లి వెంకటేశ్వర్లు, వడ్డె వెంకటనారయణ, రోకటి నరసింహారావు, కోటం రాజు, చావా వెంకటేశ్వరరావు, అడప సురేష్, పి. వీరబాబు, నాగేశ్వర రావు, కృష్ణార్జునరావు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు పిజి. కృష్ణమూర్తి, గుర్రం నవీన్, గుర్రం నరసింహారావు, సాయిన్ని కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు గన్నవరం తరలివెళ్లారు. బేతాళపాడు, వినోభానగర్ గ్రామాలకు చెందిన శ్రేణులు వాహనాలల్లో వెళ్లారు.

●ఇల్లెందుటౌన్: ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా ఏర్పాటైన ఎన్‌డీఏ ప్రభుత్వం ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారానికి ఇల్లెందుకు చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. టీడీపీ ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముద్రగడ వంశీ, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చందావత్ రమేష్‌బాబు నాయకులు శ్యాం తివారీ, కారు నర్సన్న, బాబు, దేవరకొండ నవీన్, పొదిల శ్యాం, వినిత్ తదితరులు పాల్గొన్నారు.

●మణుగూరు: ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం మణుగూరులో నాయకులు సంబరాలు జరుపుకున్నారు.నాయకులు వాసిరెడ్డి చలపతిరావు, సమితి సింగారం సర్పంచ్ బచ్చల భారతి, గడ్డం మల్లిఖార్జున్, అడపా వెంకటేశ్వర్లు, చిర్రా రవికుమార్, మానుకొండ రఘురామ్, యార్లగడ్డ రాజు, ఎస్సీ సెల్ సీనియర్ నేత మద్దెల భద్రయ్య, ఎలామటి, పూర్ణ, ఖమ్మురుస్సీస్సా భేగం రామారావు తదితరులు పలు ప్రాంతాలకు వెళ్లి పేదలకు, అనాధలకు బోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. నాయకులు వాసిరెడ్డి చలపతిరావు, భద్రయ్య, బచ్చల భారతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుడిడిపూడి వెంకటేశ్వరరావు, ఉమాకర్ , హరి, ప్రసాద్, వెంకటేశ్వర్లు, ఉడతానేని రవి, సత్యనారాయణ, కొమరం మల్లయ్య, పాల్గొన్నారు.

ఏపీ సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం నేపథ్యంలో...

రామాలయంలో మొక్కు తీర్చుకున్న దేశం నాయకులు

భద్రాచలం, జూన్ 12: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఏపీ సీఎంగా బుధవారం ప్రమాణ స్వీకారం నేపథ్యంలో భద్రాచలంలోని రామాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కొడాలి శ్రీనివాసన్, కుంచాల రాజారాం, రేపాక రాంబాబు, కంభంపాటి సురేష్‌కుమార్, చల్లగుళ్ల నాగేశ్వరరావు, కోనేరు రాము, అబ్బినేని శ్రీనివాసరావు, అడుసుమిల్లి జగదీష్, పరిమి సోమశేఖర్, తాళ్లూరి చిట్టిబాబు, నూతలపాటి దాసయ్య, దుక్కిపాటి ప్రకాశరావు, కొడాలి చంటి , పల్లంటి దేశప్ప. కొండవీటి బ్రదర్స్ పాల్గొన్నారు.



జూలూరుపాడులో కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు

దమ్మపేటలో..

దమ్మపేట: ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు సీఎం బాధ్యతలు చేపట్టటంతో పాటు టిడిపి అధికారంలోకి రావటంతో దమ్మపేటలో బుధవారం హనుమాన్ గుడి వద్ద టీడీపీ శ్రేణులు 116 కొబ్బరికాయలు కొట్టి మ్రొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు వలీపాషా, సీనియర్ నాయకులు గడ్డిపాటి సత్యం, ఎలమాటి బాబ్జి, బోగి సత్యం, నర్సింహారావు, చిర్రా ధర్మారావు, నాయుడు సుబ్బారావు, మళ్ళా గణేష్ తదితరులున్నారు.